తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్

మంగళవారం
13 అక్టోబర్ 2026

పేజీలు - 12



### మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో

## ఆపరేషన్ చెబుత్రా

- 10 బైక్ లు స్వాధీనం, 28 మందిపై కేసులు నమోదు
- అనంతరం కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్

**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 12 (జనం సాక్షి):** వరంగల్ పోలీస్ కమిషనర్ యన్.శ్వత ఐపిఎస్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో "ఆపరేషన్ చెబుత్రా" నిర్వహించి 10 బైక్ లు స్వాధీనం చేసుకొని, 28 మందిని అదుపులోకి తీసుకొని, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో మిల్స్ కాలనీ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై సంచరించడం, న్యూసెన్స్ సృష్టించడం వంటి కార్యకలాపాలను నియంత్రించే లక్ష్యంతో నిర్వహించే "ఆపరేషన్ చెబుత్రా" కార్యక్రమాన్ని తేదీ 11 నాడు రాత్రి అజాం జాహి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్, వరంగల్ పరిధిలో నిర్వహించడం జరిగింది ఈ ఆపరేషన్‌లో భాగంగా చింతల్, అబ్బనికుంట, లేబర్ కాలనీ, ఫోర్ట్ వరంగల్, శివనగర్, ఎస్.ఆర్.ఆర్. తోట, ఉర్సు గుట్ట, కరీమాబాద్, ఉర్సు, శంభునిపేట, రంగశాయిపేట తదితర ప్రాంతాల్లో పోలీసులు మిగతా 15లో..

# అజాంనగర్ రైతు అశోక్ మృతదేహం లభ్యం





- వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు బలైనట్లు అనుమానాలు..
- నిందితులుగా అనుమానిస్తున్న వారి విచారణతో బయటపడిన ఆచూకీ..
- యామన్‌పల్లి సమీపంలోని దట్టమైన అడవిలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం గుర్తింపు..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామన్‌పల్లి శివారులో నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన భూపాలపల్లి మండలం అజాంనగర్ గ్రామానికి చెందిన జడల అశోక్ (35) ఘటన విషాదాంతమైంది. అశోక్ మృతదేహం సోమవారం యామన్‌పల్లి సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో లభ్యమైంది.

వార్త మెయిన్ 3లో

# నకిలీ విత్తనాలను అంటగట్టిన మంగళ సీడ్స్

- మూడు నెలలు దాటిన పొట్ట దశకురాని వైనం.
- కోత దశకు వచ్చిన ఇతర కంపెనీల సిద్ధి విత్తనాలు.
- వ్యాపారులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు.



**గోవిందరావుపేట, అక్టోబర్12( జనం సాక్షి)** :నకిలీ సిద్ధి డబ్ల్యూ జి ఎల్ 44 విత్తనాలను వరంగల్ కు చెందిన మంగళ సీడ్స్ అంటగట్టి మోసం చేసిందని మండల రైతులు వాపోతున్నారు. సోమవారం ఈ మేరకు విత్తన విక్రయదారులపై రైతులు పసర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దుంపెల్లి గూడెం రామ్ నగర్ మాన్య తండా తాతయ్య పల్లి గ్రామాలకు చెందిన రైతులు తమ బాధను వినిపించారు. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ దృష్టిలో ఉంచుకొని వరంగల్ రామ్ నగర్ ఏరియా కు చెందిన మంగళ సీడ్స్ నుండి స్థానిక వ్యాపారులు తెచ్చిన సిద్ధి డబ్ల్యూ జి ఎల్ 44 విత్తనాలను ఖరీదు చేయడం జరిగిందని అన్నారు. నాటు పెట్టి మూడు నెలలు గడుస్తున్న పుట్టదశకు రాకపోవడం విత్తనాలపై అనుమానం రేకెత్తించిందని అన్నారు. ఇతర కంపెనీల సిద్ధి విత్తనాలు కోత దశకు వచ్చిన ఈ విత్తనాలు పొట్ట దశకు కూడా రాకపోవడం వల్ల లబోదిబోమంటున్నామని అంటున్నారు. అసలే ఎండలు ఏలినినో ప్రభావం ఇప్పటికే పంటలు ఎండిపోతున్నాయి స్వల్పకాలిక రకం అని నాటితే అది దీర్ఘకాలిక రకం అయింది. ఇప్పుడు ఏం చేయాలో పాలు పోవడం లేదు, విక్రయించిన స్థానిక వ్యాపారులు బిల్లుల ఆధారంగా కేసు నమోదు చేసుకోమని అంటున్నారు. విత్తన ఉత్పత్తి వ్యాపారి అశోక్ ను సంప్రదిస్తే వారం పది రోజుల తర్వాత వస్తానని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడు. స్థానిక వ్యవసాయ అధికారి జితేందర్ రెడ్డి కూడా కోతదశకు ఉన్న సిద్ధి విత్తనాలను మంగళ సీడ్స్ విత్తనాలను పరిశీలించగా తేడా ఉందని రైతులకు తెలిపారని రైతులు అంటున్నారు. ఈ కంపెనీ విత్తనాలను మండల వ్యాప్తంగా 1500 విత్తన బ్యాగులను విక్రయించినట్లు వ్యాపారులు రైతులు తెలుపుతున్నారు. 145 రోజుల పంట కాలం అని మంగళ సీడు విత్తనాలు నాటితే 100 రోజులైనా పొట్టకు రాకపోవడం రైతులను ఆశ్చర్యానికి గురి చేస్తోందని, సదరు వ్యాపారికి విన్నవించిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విత్తన విక్రయ షాపు యాజమానులు పేర్కొంటున్నారు. కాగా రైతులు రాజకీయ పార్టీలు రైతు సంఘాలు తమకు అండగా నిలిచి పరిహారం ఇప్పించేందుకు కృషి చేయాలని కూడా విన్నవించుకుంటున్నారు. విత్తన ఉత్పత్తిదారుడు స్పందించకపోతే ధర్నా రాస్తారోకోలు చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు. ఈ నకిలీ విత్తనాల అంశంపై బాధిత రైతులు సామా వెంకటరెడ్డి, ఆలోత్ కిషన్, బద్దం అంతిరెడ్డి, అజ్మీర స్వామి, మిగతా 15లో..



### ప్రజా సమస్యల పరిష్కారానికి

## ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 12 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణంలోని ఆర్కా బేకరీలో పని చేస్తున్న ఉద్యోగులు తమకు గత 3 నెలలుగా రావలసిన జీతాలను ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం కొత్తహరిపేట మిగతా 15 లో..

# కుమురం సూరు జెండా గద్దెకు స్థలం కేటాయించాలి

## జైనూర్ తహసీల్దార్ బిర్ షాకు కొలాం సేవా సంఘం వినతి



**జైనూర్: అక్టోబర్ 12 ( జనం సాక్షి)** జైనూర్ మండల కేంద్రంలో కొమురం సూరు వర్ధంతి సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించేందుకు జెండా గద్దె నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ కొలాం సేవా సంఘం నాయకులు సోమవారం జైనూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ మూడు మండలాలకు చెందిన కొలాం సేవా సంఘం నాయకులు ఈ వినతిపత్రాన్ని అందజేశారు. దసరా పండుగను పురస్కరించుకొని కొమురం సూరు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించేందుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్‌ను కోరారు. వినతిపత్రం సమర్పించే ముందు కొలాం సేవా సంఘం నూతన కమిటీ సభ్యులు కొమురం సూరు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల అధ్యక్షుడు ఆత్రం బాపూరావు, గౌరవ అధ్యక్షుడు ఆత్రం రాజు, ప్రధాన కార్యదర్శి ఆత్రం భీంరావు, ఉపాధ్యక్షుడు కొడప భీంరావు, సలహాదారు ఆత్రం భీంరావు, కార్యదర్శి కొడప రాజుతో పాటు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పద్మావతి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి



**కేరమేరి,అక్టోబర్ 12(జనంసాక్షి )** కేరమేరి మండలం అంతాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పద్మావతి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్తులు సర్పంచ్ పార్వతాబాయి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. అంతాపూర్ పంచాయతీ రాజ్ రోడ్డు నుండి పద్మావతి గ్రామం వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర బిటి రోడ్డు మంజూరు చేయాలని వారు కోరారు. ప్రస్తుతం ఈ మార్గంలో సరైన రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, పాఠశాల విద్యార్థులు, రోగులు, రైతులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంతాపూర్ నుండి పద్మావతి వరకు ఉన్న మార్గం ప్రస్తుతం మట్టి రోడ్డుగా ఉండటం, గతంలో అనేకసార్లు స్థానిక ప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బీటీ రోడ్డు మంజూరు చేసి గ్రావెల్ రోడ్డు పనులు ప్రారంభించాలని, గ్రామ ప్రజల రవాణా, వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప సర్పంచ్ జాదవ్ దిలీప్, వార్డు సభ్యులు నాయక్ గణపతి, బలిరామ్,కైలాస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ గుండా మల్లేష్ 6వ వర్ధంతి జయప్రదం చేయండి

## సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ పిలుపు




**తాండూర్, అక్టోబర్ 12(జనం సాక్షి)** ఈనెల 13న ఉదయం 11 గంటలకు నిర్వహించ తలపెట్టిన మాజీ ఎమ్మెల్యే, కామ్రేడ్ గుండా మల్లేష్ 6వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని బోయపల్లి గ్రామంలో నిర్వహించిన సిపిఐ గ్రామ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ ముందున్న స్థూపానికి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం ప్రజానాట్యం మండలి కళాకారులతో ప్రదర్శనగా బయలుదేరి, ఐబి చౌరస్తాలోని ఫ్లైఓవర్ క్రింద కామ్రేడ్ గుండా మల్లేష్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించనున్నట్లు బానేష్ తెలిపారు. ఈ సందర్భంగా కొండు బానేష్ మాట్లాడుతూ... కామ్రేడ్ గుండా మల్లేష్ తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలక పాత్ర పోషించారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చెరగని ముద్ర వేశారని, నాటి అసెంబ్లీలో సిపిఐ శాసనసభ పక్ష నేతగా తెలంగాణ వాణిని ఢిల్లీ పీఠం కదిలేలా బలంగా వినిపించారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వంతో జరిగిన పలుమార్లు చర్చల్లోనూ, శ్రీకృష్ణ కమిటీ ముందూ తెలంగాణ వాదనను అత్యంత సమర్థవంతంగా వినిపించిన ప్రజానేత గుండా మల్లేష్ అని ఆయన శ్లాఘించారు. ఈ వర్ధంతి సభకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు మరియు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ గ్రామ సమావేశంలో సిపిఐ తాండూర్ మండల సహాయ కార్యదర్శి నరాల ప్రహ్లాద్, ముఖ్య నాయకులు మేకార్తి రామదాసు, నామనీ లక్ష్మయ్య, ఇప్ప వెంకటి, పూర్ర రాజేశం, కొండపర్తి సతీష్, ఉప్పుల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీటీసీ నీల రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి



**బచ్చన్నపేట ( జనం సాక్షి):** బచ్చన్నపేట మండలం కొడువటూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ నీల రమేష్ మాతృమూర్తి మరణించడంతో మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాతృమూర్తి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి మనోధైర్యాన్ని అందించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ మసూద్, కొమురవెల్లి దేవస్థాన కమిటీ ఛైర్మెన్ గంగం నరసింహారెడ్డి. జిల్లా కార్యదర్శి దత్తరపు నరేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఇజ్జగిరి రాములు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏద్దు హరీష్. జంగిటి విద్యానాథ్, జిల్లా సందీప్, గ్రామ శాఖ అధ్యక్షులు రవికుమార్, నిమ్మ కరుణాకర్ రెడ్డి, బొట్టు గణపతి, దండుగుల లక్ష్మయ్య, నరేష్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొని నీల రమేష్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

## కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్



**చెన్నారావుపేట, అక్టోబర్ 12 ( జనం సాక్షి ):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్, చెన్నారావుపేట, అమీనాబాద్ సొసైటీ చైర్మన్‌లు భూక్య గోపాల్ నాయక్, మొగిలి వెంకట్ రెడ్డిలు ప్రారంభించారు. మండలంలోని శంకరం తండా, గొల్ల భామ తండా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు కొర్ర వసంత, అమ్మిలకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సారద్యంలో నర్సంపేట నియోజకవర్గంలో పేద ప్రజల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. పేద ప్రజలకు అండగా ఉన్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేతిడి వీరా రెడ్డి, గ్రామ సర్పంచ్ భూక్య లావణ్యహనుమా నాయక్, గొల్ల భామ తండా అమీనాబాద్ సర్పంచ్లు గుగులోతు బాలు నాయక్, దార రంజిత్, ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి హరీష్, ఉప సర్పంచ్ బోడ చందా, గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యాక్షులు బానోత్ ఈర్య, హచ్చా, కొర్ర బీము, దామోదర్, బోడ బాలు, కుమార స్వామి, బద్రు, వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

## ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన 12 ఫిర్యాదులను శ్రద్ధగా విని, సంబంధిత సీఐలు, ఎస్ఐలతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధంగా ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, త్వరితగతిన పరిష్కరిస్తున్నామని, సత్వర, పారదర్శక సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని ఎస్పీ తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి



**నిర్మల్ టౌన్, అక్టోబర్13,(జనంసాక్షి )** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, చట్టపరిధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయరాదని సూచించారు.

# సిసి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి

## ఇబ్బంది పడుతున్న వాహనదారులు ప్రజలు

**ఆత్మకూరు, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** గుంతల మయమైన సిసి రోడ్డుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని మల్కకపేట గ్రామ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మాదం శ్రావణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మల్కపేట గ్రామంలో మాట్లాడుతూ.. మల్కపేట గ్రామం నుండి కొత్తగట్టుకు వెళ్లే రహదారిలో భారీ గుంతలు ఏర్పడి ప్రయాణికులు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ రహదారిలో విద్యార్థులు, రైతులు, ప్రయాణికులు, నిత్యం రాకపోకలు కొనసాగిస్తారని ఈ రహదారి గుంతల మయంగా మారడంతో నిత్యం అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు అవుతున్న సిసి రోడ్డుకు మరమ్మతులు కానీ గ్రామంలోని సమస్యలు కాని పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు జంకుతున్నారని ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డును ఇప్పటివరకు అధికారులు ప్రజాప్రతినిధులు కాని సందర్శించిన దాఖలాలు లేవని ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డుకు మురమ్మతులు చేపించాలని మాధం శ్రావణ్ కోరారు.



## ఎల్లాయగూడెంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు



**చెన్నారావుపేట, అక్టోబర్ 12 ( జనంసాక్షి):** మండలంలోని ఎల్లాయగూడెం గ్రామంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రెండవ రోజు దుర్గామాతను గాయత్రి దేవి అలంకరణలో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో దంపతులు మంచోజు స్వప్న మనోజ్ కుమార్, కాగితోజు స్రవంతి ఉపేందర్, పరికిపండ్ల సాయి ప్రియ చంద్రశేఖర్, కర్రె శ్రీశృతి శ్రీనివాస్, భక్తులు వేముల రాఘవేంద్ర, భాషబోయిన విగ్నేష్, భాషబోయిన తరుణ్, గంధం చిన్ను, భాషబోయిన స్టాలిన్, కర్రె భరత్, బొమ్మరబోయిన గణేష్, వేములకొండ అక్షర, తదితరులు పాల్గొన్నారు.

## చెన్నారావుపేట ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గోవర్ధన్

**చెన్నారావుపేట, అక్టోబర్ 12 ( జనం సాక్షి):** చెన్నారావుపేట ఎస్సైగా పొన్నాల గోవర్ధన్ బాధ్యతలను స్వీకరించారు. సోమవారం చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన రాజేష్ రెడ్డి బదిలీపై మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా పనిచేసి బదిలీ పై చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు వచ్చినట్లు నూతన ఎస్సై గోవర్ధన్ తెలిపారు. శాంతి భద్రతల విషయంలో గ్రామాలలోని ప్రజలు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.



## ఉద్యమకారులను కంటిరెప్పల కాపాడుకుంటా

### రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు



**ఆత్మకూర్, అక్టోబర్ 12 (జనం సాక్షి):** తెలంగాణ ఉద్యమకారులను కంటిరెప్పల కాపాడుకుంటానని రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు అన్నారు. ఆత్మకూరు మండలంలోని హౌజ్ బుజుర్గ్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు నీలం కుమార్ తండ్రి నీలం సారయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి వారి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్సండ్ల సదానందం, జిల్లా యూత్ కార్యదర్శి వంగేటి ప్రభాకర్ ,ఆత్మకూరు మండల అధ్యక్షులు ఎండి బాబుమియా (చిరు) అంకతి రవి, భాష బోయిన సాగర్, హుస్సే న్, శంకర్, ముత్యాల మహేందర్ తదితరులు అందరు పాల్గొన్నారు.

## బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



**లక్ష్మణ చందా, అక్టోబర్ 12 (జనం సాక్షి):** లక్ష్మణ చందా మండలంలోని రాచాపూర్ గ్రామంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి బాలా త్రిపుర సుందరి రూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తిగా తరలివచ్చారు. అలాగే ఇద్దరు చిన్నారులకు చీరలంకరణ చేసి, బాలా త్రిపుర సుందరి దేవి వేషధారణలో అందంగా అలంకరించారు. అనంతరం చిన్నారులకు ఒడిబియ్యం పోసి, పసుపు కుంకుమలతో సంప్రదాయబద్ధంగా అలంకరించారు. ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకలో చిన్నారులు, పెద్దలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

## మాజీ ఉప సర్పంచ్ కొమురయ్య కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

**చెన్నారావుపేట, అక్టోబర్ 12 ( జనం సాక్షి):** మండలంలోని అక్కల్ చెడ గ్రామనికి చెందిన కాంగ్రెస్ మాజీ ఉప సర్పంచ్ కొత్త కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఆయన దశ దిన కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ మండల నాయకులు భూక్య సురేష్ తో కలిసి ఆయన స్వగృహానికి చేరుకొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.. అనంతరం అతని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 2 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు పులిశేరు రాజేందర్, నాయకులు తూటి రమేష్, మాజీ ఉప సర్పంచ్ బానోత్ వీరన్న నాయక్, గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లావుడ్య వెంకన్న, నాయకులు బాదావత్ పెద్ద వీరు, బాదావత్ వీరు, ముత్యం భద్రయ్య, వార్డు సభ్యులు ఒంటరి రాజు, ఇస్లావత్ వీరు, బాదావత్ సురేష్, భూత్ అధ్యక్షులు తేజావత్ శివ, బాదావత్ కిషోర్, ఒంటరి అశోక్, పడిదం రాకేష్, కొత్త ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ఖాదర్‌పేట శివారులో రెండు బైకులు ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు

**చెన్నారావుపేట, అక్టోబర్ 12 ( జనం సాక్షి ):** మండలంలోని ఖాదర్‌పేట గ్రామ శివారులోని మూలమలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీ: కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. నర్సంపేటకు చెందిన కొత్త సత్యనారాయణ ముడిసరుకుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఖాదర్‌పేట గ్రామ శివారులోని మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఆయన ప్రయాణిస్తున్న బైకు ఢీ: కొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది పైలట్ వైనాల నాగరాజు, ఈఎంటీ ప్రవీణ్ కుమార్ వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి తదుపరి చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 50 కిలోల బియ్యం పంపిణీ

### అండగా నిలిచిన చెన్నారావుపేట సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి



**చెన్నారావుపేట, అక్టోబర్ 12 ( జనం సాక్షి ):** మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 50 కిలోల బియ్యాన్ని చెన్నారావుపేట గ్రామ సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి పంపిణీ చేశారు. చెన్నారావుపేటకు చెందిన మైదం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు అతని కుటుంబానికి అండగా నిలిచేందుకు చెన్నారావుపేట సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి 50 కిలోల బియ్యాన్ని అందించగామాజీ సర్పంచ్ మేకల నర్సయ్య, అడుప అశోక్ లు స్థానిక నాయకులతో కలిసి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి బియ్యాన్ని అందజేశారు.

## మిత్రుడి కుటుంబానికి తోటి క్రికెట్ మిత్రులు రూ. 16 వేల ఆర్థిక సహాయం



**చెన్నారావుపేట, అక్టోబర్ 12 ( జనం సాక్షి):** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లింగగిరి గ్రామానికి చెందిన సప్పిడి నరేష్ కుటుంబానికి తన తోటి క్రికెట్ మిత్రులు రూ. 16 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. సోమవారం అతని కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించి అతని పిల్లలకు పండ్లు రూ.16వేల ఆర్థిక సహయంను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ మిత్రులు రాకం వేణు, మాదరపు రాము, రాకం రాకేష్, మాదరపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీ పై అందుబాటులో మొక్కజొన్న, పెసర విత్తనాలు

### మండల వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ రెడ్డి

**చెన్నారావుపేట, అక్టోబర్ 12( జనం సాక్షి):** రైతులకు సబ్సిడీ పై అందుబాటులో మొక్కజొన్న, పెసర విత్తనాలు ఉన్నాయనిమండల వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ రెడ్డి సోమవారం తెలిపారు. చెన్నరావుపేట రైతు వేదికలో సబ్సిడీ మొక్కజొన్న విత్తన రకం డిహెచ్ఎం -206 రకం 4 కిలోల సంచికి రూ.400, పెసర విత్తన ఎంజిజి -385 రకం 4 కిలోల సంచికి రూ.430 అందుబాటులో ఉన్నాయని వీటిని సబ్సిడీపై అందించనున్నట్లు తెలిపారు. కావలసిన రైతులు పట్టా పాసుబుక్, ఆధార్ కార్డు జిరాక్స్ లను తీసుకొని సంప్రదించాలని ఆయన కోరారు.



# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మెకు సైరన్

- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలి
- కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయలేదు ప్రభుత్వానికి మా రోదనలు పట్టడం లేదా ?

**ల్యాబ్ టెక్నీషియన్ చంద్రమౌళి**



**కమలాపూర్, అక్టోబర్ 12 (జనం సాక్షి)** ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని పలు డిమాండ్లతో గత నెల 28 నుండి అక్టోబర్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిరసన కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి నిరవధిక సమ్మె చేపట్టాలని ఎన్ హెచ్ ఎం జేఏసీ పిలునిచ్చారు. ఈ సందర్భంగా కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజ్ కు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ చంద్రమౌళి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న సుమారు 17వేల మంది ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా తెలంగాణ ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా అంకితభావంతో తమ విధులను నిర్వహిస్తున్నారని అన్నారు. కరోనా మహమ్మారి వంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా తమ ప్రాణాలను, కుటుంబ సభ్యుల భద్రతను సైతం పక్కనపెట్టి ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ముందుండి సేవలందించారని గుర్తు చేశారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గతంలో అనేక సందర్భాల్లో వివిధ సంఘాల ద్వారా ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు కూడా సమర్పించి సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగిందని అయినా ఆశించిన స్థాయిలో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 28 నుండి 14 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల పట్ల జాలి చూపలేదన్నారు. ఈ నెల 13 నిరవధిక సమ్మె చేపట్టాలని ఎన్ హెచ్ ఎం జేఏసీ పిలుపునిచ్చిన సందర్భంగా విధులకు హాజరు కాబోమని అన్నారు. వెంటనే ప్రభుత్వం ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల ప్రధాన డిమాండ్ అయిన రెగ్యులరైజేషన్ తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు సరిత,ప్రమీల,సంపూర్ణ,జ్యోతి,లావణ్య,జమున,సరోజ,లావణ్య, వనజ,అర్జయ్య తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవిద్యను అంకిత భావంతో అభ్యసించాలి

- వరంగల్ హనుమకొండ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు కే పూజ, ఎస్వి హైమ పూజిత
- ఆదర్శలా కాలేజీలో ఓరియంటేషన్ కార్యక్రమం
- అనంతరం బతుకమ్మ సంబరాలు





**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 12 (జనం సాక్షి)** వరంగల్‌లోని ఆదర్శలా కాలేజీ ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సరం న్యాయ విద్యార్థుల కోసం సోమవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. న్యాయ విద్య ప్రాధాన్యత, రాజ్యాంగ విలువలు, వృత్తిపరమైన నైతికత, న్యాయవాదుల బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యం ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.పూజ, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి ఎన్.వి. హైమ పూజిత, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, న్యాయ విద్యను అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీతో అభ్యసించాలని, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ వృత్తిపరమైన నైతికత, సామాజిక బాధ్యత కలిగిన న్యాయ నిపుణులుగా ఎదగాలని సూచించారు. సమాజంలో న్యాయం, సమానత్వం స్థాపనకు కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాల చైర్మన్ బూర విద్యాసాగర్, ప్రిన్సిపాల్ డా. పి. ప్రతిభా రాథోడ్ ముఖ్య అతిథులను ఆహ్వానించారు. నైతిక విలువలు, సామాజిక బాధ్యత కలిగిన న్యాయ నిపుణులను తీర్చిదిద్దడమే కళాశాల లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఓరియంటేషన్ కార్యక్రమం అనంతరం కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పారు. విద్యా కార్యక్రమంతో పాటు సాంస్కృతిక వేడుకలు కళాశాల ప్రాంగణాన్ని ఆనందోత్సాహాలతో నింపాయి.

## చిట్యాల చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



**చిట్యాల, అక్టోబర్ 12 (జనం సాక్షి):**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆవిర్భావం జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రమైన చిట్యాల చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేసి అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ, స్వరాష్ట్ర సాధనతో పాటు పరిపాలనా వికేంద్రీకరణే ధ్యేయంగా కేసీఆర్ చేపట్టిన జిల్లాల పునర్వ్యవస్థీకరణతో పరిపాలన ప్రజల ముంగిటకు వచ్చిందన్నారు. వెనుకబడిన ప్రాంతమైన భూపాలపల్లిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించి, సకల సదుపాయాలు కల్పించి అభివృద్ధి పథంలో నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, ప్రధాన కార్యదర్శి మడికొండ రవీందర్ రావు, యువజన అధ్యక్షులు తౌటం నవీన్, సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, నాయకులు చిలుముల రమణాచారి, దామెర రాజు, క్యాతం రమేష్, సిరిపురం నర్సింగరావు, మేడిపల్లి శ్రీనివాస్, వేముల హరీష్, పుల్ల సతీష్, చెర్ల చందు, కాట్రవుల కుమార్, రమేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



**కాటారం, అక్టోబర్ 12 : (జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని కాటారం శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయం ప్రహరీ నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మన మల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పంతకాని సడవలి , మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని వేద మంత్రోచ్చరణాల మధ్య భూమి పూజ నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలు సజావుగా కొనసాగించాలని కోరారు. నిర్మాణంలో చేపట్టబోయే కార్యక్రమాలకు భక్తులు, పుర ప్రముఖులు, ప్రజలు ఇతోధికంగా విరాళాలు అందజేయాలని కోరారు. దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు తోటపల్లి వీరారెడ్డి, బీరెల్లి అంజయ్య, మద్ది లక్ష్మీ నరసింహమూర్తి, పులి అశోక్, కొడపర్తి రవి, పెండ్యాల శ్రీరాములు, గౌని సుధాకర్, గడ్డం చంద్రయ్య, ఓలపు రాజబాబు, గడ్డం పర్వతాలు, జీయర్ మల్లేష్ , జల్లారపు మల్లయ్య, , గౌని జగదీశ్వర్, గాదే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషి మరువలేనిది

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**




జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, **అక్టోబర్ 12 :** (జనంసాక్షి): భూపాలపల్లి అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషి మరువలేనిదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పడి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదులను, ఎస్పీ, కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, అధికారులను, మెడికల్ కాలేజీలో స్టాఫ్, విద్యార్థులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ భూపాలపల్లిని జిల్లా కేంద్రంగా మార్చడం చరిత్రలో మైలురాయి అని, జిల్లా ఏర్పాటుతో పరిపాలన ప్రజలకు చేరువైందని అన్నారు. సమీకృత కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, ఆసుపత్రి నిర్మాణంతో ప్రజలకు సేవలు సులభంగా అందుతున్నాయని, న్యాయవాదులకు ఉపాధి పెరిగిందని తెలిపారు. జిల్లా అభివృద్ధికి పునాది వేసిన కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మూడేళ్లలో ఆశించిన అభివృద్ధి చేయలేదని, మిగిలిన కాలంలోనైనా పనులు వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హన్మకొండ కలెక్టరేట్‌లో తాగునీటి కరువు

**గ్రీవెన్స్‌కు వచ్చే ప్రజల అవస్థలు**



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 12 (జనం సాక్షి)** :హన్మకొండ కలెక్టర్ ఆఫీసులో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ సెల్‌కు వచ్చే ప్రజలు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అవసర నిమిత్తం దూర ప్రాంతాల నుండి తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే వృద్ధులు, మహిళలు ఎండలో ప్రయాణం చేసి కలెక్టరేట్ కు వచ్చి గ్రీవెన్స్ క్యూలో నిలబడి దాహంతో అల్లాడు ఉన్నారని పలువురు వాపోయారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ ఆవరణలో కనీసం మంచినీటి సదుపాయం కూడా లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు స్వీకరించే అధికారులు ప్రజల కనీస అవసరాలను కూడా పట్టించుకోవడం లేదని, వెంటనే తాగునీటి వసతి కల్పించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

## సెల్‌ఫోన్ దొంగతనాల కేసులో
# మైనర్ అదుపులోకి 6 సెల్‌ఫోన్లు స్వాధీనం



**బచ్చన్నపేట ( జనం సాక్షి ):** బచ్చన్నపేట బస్టాండ్‌లో రద్దీని ఆసరాగా చేసుకుని సెల్‌ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఒక మైనర్ ( సిసిఎల్ ) ను బచ్చన్నపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి సుమారు రూ.1.20 లక్షల విలువైన 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మైనర్‌పై చట్ట ప్రకారం తగిన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ రద్దీ ప్రదేశాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి, సెల్‌ఫోన్లు, నగదు, బంగారు ఆభరణాలు తదితర విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మైనర్‌ను అదుపులోకి తీసుకుని, చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లు మక్బూల్, తిరుపతి నాయక్‌లను ఏసిపి భీమశర్మ. సీఐ దేవేందర్ ప్రత్యేకంగా అభినందించారు

# సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
## మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న



**కేసముద్రం అక్టోబర్ 12 (జనం సాక్షి ):**పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ భానోత్ సునీత వెంకన్న అన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు లబ్ధిదారుని ఇందిరమ్మ ఇల్లు భూమి పూజలో పాల్గొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చడం ద్వారా పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నామని వారు మాట్లాడారు.స్థానిక వార్డ్ కౌన్సిలర్ దారావత్ కిషోర్,గ్రామ పార్టీ అధ్యక్షులు కొండా సురేష్,మార్కెట్ డైరెక్టర్ యాదగిరి,మల్లారెడ్డి,అజిత్ రెడ్డి,పింగిలి ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గిద్దెముత్తారం వాసి మృతి

- ఎంజీఎంలో చికిత్స పొందుతూ కన్నుమూత
- చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ వెల్లడి

**చిట్యాల, అక్టోబర్ 12(జనం సాక్షి):** ద్విచక్ర వాహనం స్కిడ్ అయి కింద పడటంతో తీవ్రంగా గాయపడిన గిద్ద ముత్తారం గ్రామానికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు. గిద్దెముత్తారం గ్రామానికి చెందిన పంగ శ్రీనివాస్ (48), ఆయన భార్య భాగ్య పిల్లల చదువుల నిమిత్తం భూపాలపల్లిలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం స్వగ్రామంలోని ఇంటి వద్ద గ్యాస్ సిలిండర్ తెచ్చుకునేందుకు శ్రీనివాస్ బైక్‌పై బయలుదేరారు. రాత్రి 8 గంటల సమయంలో గిద్దెముత్తారం తండా సమీపంలో ఎదురుగా వచ్చిన వాహనం లైట్ల వెలుగు కళ్లపై పడటంతో హఠాత్తుగా బ్రేక్ వేశారు. దీంతో బైక్ స్కిడ్ అయి కింద పడటంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని భూపాలపల్లి ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, సోమవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సాఫ్ట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో
# అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సంజన




**చెన్నారావుపేట, అక్టోబర్ 12 ( జనం సాక్షి):** రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో మండలంలోని అక్కల్ చెడ గ్రామానికి చెందిన పడిదం సంజన అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మూడవ స్థానాన్ని సంపాదించింది. సంజన చెన్నారావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 6వ తరగతి చదువుతుంది. ఈనెల 10, 11, 12 మూడు రోజులపాటు నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి మండలం తొర్లికొండ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 11 వ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సంజన పాల్గొని రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మూడవ స్థానాన్ని సాధించింది. ఆమెకు క్రీడల నిర్వహకులు గోల్డ్ మెడల్, క్రీడా కప్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, మండల విద్యాశాఖ అధికారిని పాపమ్మ, వ్యాయామ ఉపాధ్యాయురాలు మంజుల, తల్లిదండ్రులు పడిదం సునీల్, హేమలత, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆమెకు అభినందనలు తెలిపారు.

# తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ములుగు జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
## సమావేశానికి హాజరైన రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ములుగు జిల్లా అధ్యక్షుడిగా బేతి సతీష్ యాదవ్
## జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల కొమురయ్య




**ములుగు ప్రతినిధి, అక్టోబర్12(జనం సాక్షి):-** తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టిజెఎ) ములుగు జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలోని రాయల్ ప్లాజాలో సోమవారం జరిగింది.ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కదిరి వెంకటరమణ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం ఆర్ ఘోరి, స్టేట్ సెక్రటరీ ఖలీల్ అహ్మద్, స్టేట్ కమిటీ మెంబర్ ఆరిఫ్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజేఏ యూనియన్ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై రాష్ట్ర నాయకత్వం కార్యవర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. భవిష్యత్తులో యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించిన అనంతరం తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ములుగు జిల్లా నూతన కమిటీని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ములుగు జిల్లా అధ్యక్షుడిగా సతీష్ యాదవ్, గౌరవ అధ్యక్షుడిగా ఎర్రం స్వామి,ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల కొమురయ్య, ఉపాధ్యక్షులుగా చల్లగురుగుల రాజు,గంపల శివకుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శులుగా గట్టు ప్రశాంత్, గంద్రత్ విజయాకర్, కోశాధికారిగా సంగ రంజిత్ కుమార్ ఎన్నికయ్యారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా మొలుగూరి సంపత్, దొమ్మటి వెంకటేష్, కోల కోటి, కె ఆర్ శంకర్,ఎండి చాంద్ పాషా, నూక రమేష్, తాళ్లపల్లి గోపి,వలస మధు, వాసం నారాయణ, పెండెం బిక్షపతి ఎన్నికయ్యారు.కాగా ఈ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు రాష్ట్ర కమిటీ మెంబర్లు శుభాకాంక్షలు తెలపడంతో పాటు వారిని అభినందించారు.అదేవిధంగా నూతనంగా ఎన్నికైన ములుగు జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీని శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు .ములుగు జిల్లాలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యూనియన్ బలబైతం కోసం నిరంతరం శ్రమిస్తామని ఈ సందర్భంగా నూతన కమిటీ రాష్ట్ర నాయకత్వానికి హామీ ఇవ్వడం జరిగింది.

# టేకుమట్ల మండల దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహణ

**టేకుమట్ల, అక్టోబర్ 12: జనంసాక్షి** టేకుమట్ల మండలం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) టేకుమట్ల మండల పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో స్వీట్లు పంపిణీ చేసి దశాబ్ది వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా టేకుమట్ల మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ) , వారి సిబ్బందికి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) , వారి సిబ్బందికి, అలాగే టేకుమట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ , పోలీస్ సిబ్బందికి బీఆర్ఎస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసి మండల దశాబ్ది శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటైన టేకుమట్ల మండలం పదేళ్ల ప్రస్థానంలో ప్రజలకు పరిపాలనను చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించిందని నాయకులు పేర్కొన్నారు. మండల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారులి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్



టేకుమట్ల మండల పార్టీ అధ్యక్షులు సట్ల రవి గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, మండల ముఖ్య నాయకులు బండెల నరేష్, మారం లింగా రెడ్డి వెలిశాల ఉప సర్పంచ్ ఎండీ అఫ్జల్ సారయ్య, మచ్చ రాజయ్య సర్పంచులు మాట్ల శ్రీనివాస్, రాం ఉమా దేవేందర్ పార్టీ టౌన్ అధ్యక్షులు నిమ్మల స్వామి,బీఆర్ఎస్ యూత్ నాయకులు ఎండీ అక్రమ్, నానవేణి కుమార్, చెలకాని రాకేష్, సోల్లెటి నరేష్ ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్వేషాలు సృష్టించడం సరికాదు
## చాదా మల్లయ్య ఆరోపణలను ఖండించిన తుడుందెబ్బ సంఘం నాయకులు



**మంగపేట, అక్టోబర్ 12(జనంసాక్షి )** ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు సోమవారం మండల కేంద్రంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం తుడుందెబ్బ మండలశాఖ అధ్యక్షుడు పూనెం ప్రశాంత్ అధ్యక్షత నిర్వహించగా ముఖ్య అతిథులుగా తుడుందెబ్బ ములుగు జిల్లా అధ్యక్షులు నల్లబోయిన లక్ష్మణ్ దొర, ఏఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కబ్బాక లక్ష్మణ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం మండల కేంద్రంలో జరిగిన ఆదివాసి నాయకపోడు సేవా సంఘం మండల సమావేశంలో ఆ సంఘం నాయకులు మాట్లాడిన మాటలు అన్ని పూర్తి అసత్యపు ఆరోపణలు ఆదివాసి తుడుందెబ్బ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. రాజ్యాంగం పట్ల, చట్టాల పట్ల చాదా మల్లయ్యకు అవగాహన లేదు అని కొందరు వ్యాఖ్యానించడం సరైన పద్ధతి కాదని, రాజ్యాంగంపై అవగాహన లేని వారికి పెద్ద పెద్ద పదవులు ఎలా ఇస్తారంటూ తుడుందెబ్బ నాయకులు ప్రశ్నించారు. ఎవరు ఎవరి ఇంటికి వెళ్లారో అందరికీ తెలుసునని, సుమారు ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లి దాడికి పాల్పడ్డారని నాయకులు తెలిపారు. చాదా మల్లయ్య తన తీరుపై ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఇలాంటి అసత్యపు ఆరోపణలు పునరావృతమైతే ఆదివాసి సంఘాలుగా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నాయకపోడు తెగ ఎస్టీ కాదనే ప్రచారం అవాస్తవమని, రాజ్యాంగం గుర్తించిన తెగలులో 33 తెగలు ఉన్నాయని, ఎవరి సంస్కృతి, సంప్రదాయాలు వారికి గొప్పవని స్పష్టం చేశారు. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం, రెండు సంఘాల సమన్వయంతో కలిసి పనిచేస్తున్న తరుణంలో రెండు తెగల సంఘాల మధ్య విద్వేషాలు సృష్టించడం సమంజసం కాదని అన్నారు. తక్షణమే చాదా మల్లయ్య తన వైఖరిని మార్చుకోవాలని ఆదివాసి సంఘాల తరపున హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పొదెం నాగేశ్వరరావు, తుడుందెబ్బ జిల్లా మీడియా ఇన్‌చార్జి ఎట్టి సారయ్య దొర, మండల కార్యదర్శి ఈసాల భాగ్యరాజ్, మారబోయిన గోవర్ధన్, కొమరం లక్ష్మీపతి, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సం రమేష్, కొమరం బాలయ్య, ములుగు జిల్లా మార్కెట్ డైరెక్టర్ కొమరం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 21న ప్రత్యేక లోక్ అదాలత్

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. పూజ
- విలేకరుల సమావేశంలో వెల్లడి



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 12 (జనం సాక్షి)** వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన మీడియా సమావేశంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి కందుకూరి పూజ పాల్గొని, మాట్లాడుతూ " జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలను అనుసరించి, మన వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, తేదీ : 21-11-2026 శనివారం రోజున ప్రత్యేక లోక్ అదాలత్ ను వరంగల్ జిల్లా కోర్టులో మరియు నర్సంపేటకోర్టులో నిర్వహిస్తున్నాము. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో రాజీపడదగు చెక్కు బౌన్స్ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు మరియు ఇతర రాజీపడదగు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలుపారు. కావున ఈ ప్రత్యేక లోక్ అదాలత్ నందు కక్షిదారులు ఏహాజరు అయ్యి, తమ తమ కేసులను పరిష్కరించుకునేలా సిద్ధం కావాలని కోరుచున్నాము. ప్రత్యేక లోక్ అదాలత్‌లో రాజీపడదగు కక్షిదారులు తమ తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టులలో తెలియపరిచి, రాజీ కుదుర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. 3 బెంచీలు (వరంగల్ జిల్లాలో - 2, నర్సంపేట -1) కూడిన ప్రీ-లోక్ అదాలత్ తేదీ 12.10.2026 నుండి 20.11.2026 వరకు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ లో చెక్ అమౌంట్ మీద రాజీ పడుటకు శ్రీరామ్ చిట్స్ ఫైనాన్స్ వారు 30 శాతం, చోళమండలం ఫైనాన్స్ వారు 50 శాతం డిస్కౌంట్ ప్రకటించినట్లు తెలిపారు. కావున కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీపడదగు కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు నేరుగా హాజరు కావాలని తెలియజేస్తున్నాము. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ను విజయవంతం చేయుటకు గాను వివిధ తేదీలలో న్యాయమూర్తులతో, పోలీసు అధికారులతో, న్యాయవాదుల తోనూ, బ్యాంకు మరియు చిట్ ఫండ్ మేనేజర్లతో, కోర్టు కానిస్టేబుల్స్ తో వేరు వేరు సమావేశాలు ఏర్పాటు చేసి, అధిక కేసుల పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడం జరిగింది. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ను విజయవంతం చేయడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకరించి, కక్షిదారులకు లోక్ అదాలత్ వలన కలిగే మేలును తెలియజేయడం వలన ఎక్కువ కేసులను పరిష్కరించగలుగుతామనివిజ్ఞప్తి చేస్తున్నాము.

## టేకుమట్ల టీయూడబ్ల్యూజే హెచ్

# 143 నూతన కమిటీకీ ఘన సన్మానం

- దొంతుల శ్రీనివాస్‌లి జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్
- మాతృశ్రీ ఫౌండేషన్ చైర్మన్ దొంతుల శ్రీనివాస్



**టేకుమట్ల అక్టోబర్ 12 జనంసాక్షి** టేకుమట్ల మండల కేంద్రంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మారపెల్లి రాజకొమురయ్య ప్రధాన కార్యదర్శి గోల్లెపెల్లి సంతోష్ గౌడ్ , కోశాధికారి కన్నూరు రమేష్ , భూపాలపల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి దాసారపు ప్రశాంత్ లను సన్మానించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు ఈ . కార్యక్రమంలో సర్పంచులు అంబాల కిరణ్ కుమార్ నేరెళ్ల రామకృష్ణ మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు రాజేందర్ బొల్లు సరోత్తంరెడ్డి అంబాల రమేష్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లద్దునూరి ఐలయ్య మండల పత్రిక విలేకరులు తదితరులు పాల్గొన్నారు

# రబీ సీజన్‌లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయొద్దు

- ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా స్వల్పకాలిక పంటలను సాగు మేలు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 12 (జనం సాక్షి) :**ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా రబీ సీజన్లో ఎట్టి పరిస్థితుల్లోను రైతులు వరి సాగు చేయవద్దని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లోని రైతు వేదికల్లో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. దామెర మండల కేంద్రంలోని రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులతో రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఎల్ నినో పరిస్థితుల కారణంగా నీటి లభ్యత తగ్గుతుందని పేర్కొన్నారు. కాబట్టి నీటిని పొదుపుగా వినియోగించడం వలన బిందు సేద్యంతో పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయవచ్చున్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్, తదితర పనులను చేపట్టి జలవనరులను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో 315 మండలాల్లో వర్షపాతం తక్కువగా ఉందని, ప్రభుత్వం త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తుందన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అనుసరించి రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ కల్పన, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శేషాద్రి, ,జిల్లా,వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చంద్ర, డీఆర్డీవో మేన శ్రీను, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి ఎంపీడీఓ కల్పన , మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# అర్జీలను త్వరగా పరిష్కరించాలి

## ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 12 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్ లో లేకుండా పరిష్కరించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 98అర్జీలను ప్రజలు అందజేయగా హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాల్లో 30 అర్జీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 97 అర్జీలు మొత్తం 225 వచ్చాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, స్థానిక సంస్థల జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డిఆర్డివో మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భగవాన్ దాస్ ఆశయాలు నేటికీ చిరస్మరణీయం

**మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 12 (జనం సాక్షి) :**ప్రముఖ కార్మిక నాయకులు, కమ్యూనిస్టు యోధుడు బీఆర్ భగవాన్ దాస్ ఆశయాలు నేటికీ చిరస్మరణీయం అని మాజీ ప్రభుత్వ చీఫ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం బీఆర్ భగవాన్ దాస్ 23వ వర్ధంతి కార్యక్రమాన్ని హనుమకొండ లోని బీఆర్ భగవాన్ దాస్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులతో కలిసి వినయ్ భాస్కర్ భగవాన్ దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ భగవాన్ దాస్ భౌతికంగా దూరమై 23 ఏండ్లు గడిచినా ఆయనను నేటికీ ప్రజలు స్మరించుకుంటూనే ఉన్నారని అన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో ప్రజల కోసం పనిచేసిన బీఆర్ ఆశయాలు నేటికీ చిరస్మరణీయం అన్నారు. కార్మిక సమస్యలపై నిరంతరం కృషి చేసిన బీఆర్ భగవాన్ దాస్ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేశారని అన్నారు. ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించారని, ఆయన కాపాడిన స్థలంలోనే నేడు కాళోజీ కళాక్షేత్రం నిర్మించడం జరిగిందని చెప్పారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ స్థాపించి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని పోరాడారని గుర్తు చేశారు. నగరంలో పేదల ఇండ్ల స్థలాల కోసం, గుడిసె వాసులకు పట్టాల కోసం సిపిఐ



ఆధ్వర్యంలో భగవాన్ దాస్ ఉద్యమించారని అన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్,జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, ఎన్. రాజమౌళి, ఏదునూరి వెంకట్రాజం,ఏశబోయిన శ్రీనివాస్,బత్తిని సదానందం, మాలోతు శంకర్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, భగవాన్ దాస్ కుమారులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బి. రాజ్ సిద్ధార్థ, బీఆర్ లెనిన్, మాజీ కార్పొరేటర్ లు మంచాల స్వామిచరణ్, జోరిక రమేష్,సారంగపాణి, జర్నలిస్టు నాయకులు పివి మదన్ మోహన్, తోట సుధాకర్, బొల్లారపు సదయ్య, బొడిగె శ్రీనివాస్,ఎండి నయీం పాల్గొన్నారు..

# ఆర్టీఐపై అవగాహనే పారదర్శక పాలనకు పునాది

## కాసాని రాజు ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం 20వ వార్షికోత్సవం



**దేవరుప్పుల, అక్టోబర్ 12 (జనం సాక్షి)** ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి అని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ దేవరుప్పుల మండల అధ్యక్షుడు కాసాని రాజు పిలుపునిచ్చారు. ఆర్టీఐ చట్టం అమలులోకి వచ్చి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం దేవరుప్పుల మండల కేంద్రంలో కాసాని రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా నిధుల వినియోగం, ప్రభుత్వ శాఖల పనితీరుపై సమాచారం తెలుసుకునేందుకు ఆర్టీఐ చట్టం ఉపయోగపడుతుందని తెలిపారు. పారదర్శక పాలన, అధికారుల జవాబుదారీతనానికి సమాచార హక్కు చట్టం కీలకమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు ఈ చట్టంపై అవగాహన కల్పించి, హక్కుల పట్ల చైతన్యం తీసుకురావడమే కమిటీ లక్ష్యమని కాసాని రాజు వెల్లడించారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అన్నారం పల్లవి హైస్కూల్ విద్యార్థినుల అద్భుత ప్రతిభ




**పర్వతగిరి అక్టోబర్ 12: (జనం సాక్షి)** నిజామాబాద్‌లో 10 వా తేదీ నుండి 12 వరకు జరిగిన 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి మినీ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో వరంగల్ జిల్లాకు మూడో స్థానంవరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన పల్లవి హైస్కూల్ ముగ్గురు విద్యార్థినులు పతకాలు, ప్రశంసాపత్రాలు, ట్రోఫీ సాధించి పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచిన చిన్నారులను కీలక పాత్ర పోసించిన కోచ్‌లకు ప్రత్యేక అభినందనలు తెలిపిన పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి, మహేందర్, రమేష్, అశ్విని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మరియు తల్లిదండ్రులు.

## మా వ్యవసాయ భూమికి వెళ్లే మా దారిని మాకు ఇప్పించండి

### బాధిత రైతు కల్వచర్ల విష్ణు



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 12 ( జనం సాక్షి ) :** మండలంలోని రాఘవాపూర్ గ్రామ శివారులోని తమవ్యవసాయ భూమికి వెళ్లే దారిని ఆక్రమించుకున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని మా వ్యవసాయ భూమికి వెళ్లే దారిని మాకు ఇప్పించాలని బాదిత రైతు కల్వచర్ల విష్ణు అధికారులను కోరారు. ఈ సందర్భంగా కల్వచర్ల విష్ణు విలేకరుల తో మాట్లాడుతూ హనుమకొండలోని వడ్డేపల్లికి చెందిన తాము 2011లో రాఘవపూర్ శివారులో 9 ఎకరాల 29 గుంటల వ్యవసాయ భూమిని రాఘపూర్ గ్రామానికి చెందిన వారి వద్ద తీసుకోవ డం జరిగిందని తెలిపారు. అట్టి భూమికి 16 ఫీట్ల దారి కూడా ఉందని మా వ్యవసాయ భూమిలోకి వెళ్లడం కోసం ఆ దారి నుండే గత కొన్ని సంవత్స రాలుగా వెళ్తున్నామని అన్నారు. అట్టి దారిని మా వ్యవసాయ భూమి పక్కనే ఉన్నవారు అక్రమంగా ఆక్రమించుకొని మా భూమి లోకి వెళ్లకుండా గేటు ఏర్పాటు చేశారని అన్నారు. ఈ విషయమై పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి మా భూమికి దారి ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై ఆర్ఐ శ్రీకాంత్ ను వివరణ అడుగగా త్వరలోనే ఇరు వర్గాలకు నోటీసులు అందజేసి సర్వేయర్ ద్వారా సర్వే చేపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

## కరెంట్ కోతలు రోడ్డెక్కిన అన్నదాతలు

### బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో



**కేసముద్రం,అక్టోబర్ 12 (జనం సాక్షి ):** పాలకుల నిర్లక్ష్యంపై, అధికారుల ఉదాసీనతపై మండలంలోని బెరువాడ గ్రామ పరిధిలోని రంగాపురం సబ్ స్టేషన్ కేంద్రంగా సోమవారం ఉదయం ఉవ్వెత్తున నిరసన జ్వాలలు ఎగసిపడ్డాయి. పంటలు ఎండిపోతూ ప్రజలు, రైతాంగం అల్లకల్లోలవుతున్న తరుణంలో నిత్యం ప్రజల పక్షాన నిలిచే బీఆర్ఎస్ నాయకులు బాధితులకు అండగా నిలిచారు. రైతన్నల ఆవేదనను చూసి చలించిన గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున సబ్ స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి మహాధర్నాకు దిగాయి. దీంతో రంగాపురం రహదారిపై కొంతమేర వాహనాలు నిలిచిపోయి,రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ధర్నా కారణంగా రాకపోకలు స్తంభించి,ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై కె. కాంతి కిరణ్ తన సిబ్బందితో కలిసి తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపై బైఠాయించిన రైతులు,బీఆర్ఎస్ నాయకులతో ఆయన సానుకూలంగా చర్చల అనంతరం ఎస్సై ఇచ్చిన గట్టి హామీని, శాంతిభద్రతలను గౌరవించిన బీఆర్ఎస్ నాయకులు,రైతన్నలు అధికారులతో చర్చించేందుకు అంగీకరిస్తూ తమ ధర్నాను తాత్కాలికంగా విరమించారు. త్వరలోనే విద్యుత్ సమస్య పరిష్కారం కాకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి లక్ష్మీనారాయణ,మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి కముటం శ్రీను,పట్టణ అధ్యక్షుడు వీరు నాయక్ కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి,కొమ్ము స్వాతి రాహుల్, మోడం రవీందర్ గౌడ్,కొండ రామ్మూర్తి,నరేష్ బోడ వీరు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండున్నరేళ్లుగా వేతనాల్లేవ్

- కాంట్రాక్టు ఉద్యోగుల ఆవేదన
- 30 నెలల జీతాలు పెండింగ్
- ప్రజావాణిలో కలెక్టర్‌కు మొర



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** 30నెలలుగా వేతనాలు అందక కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడుతున్నామని మహిళా, శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి జీతాలు నిలిచిపోవడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. నెలనెలా వేతనాలు అందాల్సిన ఉద్యోగులకు 30 నెలల జీతాలు పెండింగ్‌లో ఉండటంతో తమ పరిస్థితి దయనీయంగా మారిందని కన్నీటి పర్యంతమయ్యారు. జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ విభాగాల్లో వీరు విధులు నిర్వహిస్తున్నారు. సమగ్ర శిశు రక్షణ పథకం, శిశు సహాయ కేంద్రం, శిశు సంక్షేమ సంఘం, సఖి కేంద్రం, జిల్లా శిశు పరిరక్షణ కార్యాలయాల్లో 2018 నుంచి 2020 మధ్య కాలంలో ఒప్పంద ప్రాతిపదికన నియమితులయ్యారు. అప్పటి నుంచి విధులు నిర్వహిస్తున్నప్పటికీ రెండేళ్లుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా కుదేలవుతున్నామని బాధితులు తెలిపారు.

**ధ్రువీకరణ పత్రాలిచ్చినా.. తప్పని ఎదురుచూపులు!**

సేవా ధ్రువీకరణ పత్రాల పరిశీలన పేరుతో రెండేళ్ల క్రితం తమకు నోటీసులు ఇచ్చి వేతనాలు నిలిపివేశారని ఉద్యోగులు వెల్లడించారు. అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు గతంలో తాము పనిచేసిన సంస్థల నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సేకరించి సంబంధిత అధికారులకు సమర్పించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. పత్రాలు అందించినా వేతనాలు ఎందుకు విడుదల చేయడం లేదో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు సంబంధిత అధికారులను కలిసి తమ సమస్యను వివరించినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించడం లేదని పేర్కొన్నారు. చేసిన పనికి వేతనం అందకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోందని, కుటుంబ అవసరాలను తీర్చడం కూడా భారంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

**విచారణ పూర్తి చేసి వేతనాలు చెల్లించాలి**

బాధితుల వినతిని స్వీకరించిన కలెక్టర్ వెంటనే సంబంధిత జిల్లా సంక్షేమ అధికారిని పిలిపించి సమస్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా విచారణ పూర్తి చేసి నిలిచిపోయిన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో బాధితులు ఉన్నారు. రెండున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేతనాల సమస్యను ఇకనైనా పరిష్కరించి, తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేలా చూడాలని, అవసరమైతే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి

### డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు



**పరకాల, అక్టోబర్ 12, (జనంసాక్షి):** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా కృషి చేయాలని సూచించారు. పరకాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని పరకాల మండల కన్వీనర్ ఆకుల శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డు, ప్రతి బూత్ పరిధిలో నాయకులు, కార్యకర్తలు పర్యటించి అర్హులైన పట్టభద్రులను గుర్తించాలని అన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పార్టీ నాయకులు, వివిధ మోర్చాల బాధ్యులు, బూత్ అధ్యక్షులు సమన్వయంతో పనిచేస్తూ ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఓటరు నమోదు విధానం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పట్టభద్రుల్లో అవగాహన కల్పించే చర్యలు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా కృషి చేస్తూ, ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా పనిచేయాలని నాయకులు, కార్యకర్తలు సంకల్పించారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కౌన్సిలర్ కుక్కల విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్పీ జయంతి లాల్, దేవునూర్ మేఘనాథ్, జిల్లా కోశాధికారి ఎర్రం రామన్న, పట్టణ ఉపాధ్యక్షుడు మిడిదొడ్డి నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకురాలు వేముల సధారాణి, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి ఉడుత చిరంజీవి, బీజేపీ నాయకులు మార్త రాజా భద్రయ్య, బాసాని సోమరాజు, ఆకుల రాంబాబు, గునిగంటి రఘుపతి, పైండ్ల రంజిత్, వినిశెట్టి శారద, బీరం రాజిరెడ్డి, దంచనాదుల కిరణ్, ముత్యాల దేవేందర్, కాగితపు చంద్రమోహన్, బీజేవైఎం జిల్లా నాయకులు కక్కు రాజు, రంతుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరి సాగు చేయొద్దన్న డీప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



### వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు సూచనలు

**పాలకుర్తి, అక్టోబరు 12(జనంసాక్షి)** వేసవిలో వరి సాగుపై రైతులు ఆశలు వదులుకోవాలని,ఆరు తడి పంటలు మాత్రమే వేయాలని డీప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రైతులు అవగాహన కల్పించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫెరెన్సు ద్వారా భట్టి విక్రమార్క అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే రబీ సీజన్‌లో రైతులు వరి సాగు చేయొద్దని సూచించారు. కేవలం ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి మాధవిలత, ఏవో విద్యాకర్ రెడ్డి, ఏఈఓలు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

**• రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి • అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి**



**ములుగు ప్రతినిధి,అక్టోబర్ 12(జనంసాక్షి).** ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కానందున రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి తెలిపారు. సాగునీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకొని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని తెలిపారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లోని రైతు వేదికల్లో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, సాగునీటి లభ్యత, ఆరుతడి పంటల సాగుపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రబీ సీజన్లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయవద్దన్నారు. బిందు సేద్యంతో పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయవచ్చున్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్, తదితర పనులను చేపట్టి జలవనరులను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో అధిక మండలాల్లో వర్షపాతం తక్కువగా ఉందని, ప్రభుత్వం త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తుందన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ లెవెల్ నివేదికలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ములుగు జిల్లాలోని 22 రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా పలు శాఖల అధికారులు, గ్రామస్తులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ను తిలకించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి హాజరయ్యారు. వీసి అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అనుసరించి రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆరుతడి పంటల సాగుపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కలిగేందుకు విస్తృతంగా అన్ని మాధ్యమాల ద్వారా, కళాజాత బృందాలతో ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. రైతులు నష్ట పోకుండా ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వర్షాభావ పరిస్థితులు, నీటి వినియోగం, ఆరుతడి పంటల సాగుపై క్షేత్రస్థాయిలో రైతులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, డిఆర్డీఓ రవీందర్, డిసిఎస్ఓ ఫైజల్ హుస్సేన్, డిఎండిసిఎస్ఓ క్రిష్ణ వేణి, డి ఎంహెచ్ఓ గోపాలరావు, సిపిఓ జవహర్, డిపిఆర్ఓ రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

## గోపా జిల్లా ప్రధాన కార్యదర్శి
# తాళ్లపెళ్ళి రమేష్ గౌడ్‌కి ఘనంగా ఆత్మీయ సన్మానం



**తొర్రూరు ,అక్టోబర్ 12 (జనం సాక్షి):** ఇటీవల మహబూబాబాద్ జిల్లా గోపా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వికాస్ స్కూల్ కరస్పాండెంట్ తాళ్ల పెల్లి రమేష్ గౌడ్ గారిని స్థానిక గౌడ సహకార పరపతి సంఘం, కౌండిన్య సహకార పరపతి సంఘం, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అసోసియేషన్ , కంఠమహేశ్వర పరపతి సంఘాలు కలిసి సంయుక్తంగా ఘనంగా ఆత్మీయ సన్మానాన్ని నిర్వహించాయి. జి ఎస్ పి ఎస్ సంఘ అధ్యక్షులు దేశ గాని కుమార్ గౌడ్ అధ్యక్షతన మండల గోపా అధ్యక్షులు రాయపల్లి యాకయ్య గౌడ్ సమన్వయంతో స్థానిక వికాస్ స్కూల్లో నిర్వహించిన ఈ సమావేశంలో కౌండిన్య సహకార పరపతి సంఘం అధ్యక్షులు గడిల మహేందర్ గౌడ్, సర్దాం ' సర్వాయి పాపన్న గౌడ్ అసోసియేషన్ అధ్యక్షులు చీకటి అశోక్ గౌడ్, కంఠమహేశ్వర పరపతి సంఘ అధ్యక్షులు నిమ్మల శేఖర్ గౌడ్ , ఆయా సంఘాల గౌరవాధ్యక్షులు మోడెం వెంకన్న గౌడ్ ,సామకూరి ఐలయ్య గౌడ్, చీకటి రమేష్ గౌడ్ , మాజీ జిల్లా గోపాధ్యాయులు కుర్ర శ్రీనివాస్ గౌడ్ పాల్గొని రమేష్ గౌడ్ ని పూలమాలతో, శాలువాతో మెమెంటోతో ఘనంగా సత్కరించాయి ఈ సందర్భంగా గోపా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తాళ్లపల్లి రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న అన్ని గౌడ సంఘాలు సంయుక్తంగా సన్మానించడం చాలా సంతోషకరమని , ఎంతో ఆత్మ సంతృప్తిని ఇచ్చిందని అందరి సహకారం తీసుకొని రాబోయే కాలంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థుల ప్రోత్సహించడానికి ప్రతిభా పురస్కారాలు అయితే నేమి, అదే విధంగా వచ్చే నెల నవంబర్ లో గౌడ కుటుంబాలకు గుర్తుండే విధంగా కార్తీక వనభోజనాలు నిర్వహిస్తామని అదేవిధంగా త్వరలో ఈ ప్రాంతంలో ఐక్యాంప్ నిర్వహిస్తామని వివిధ సందర్భాలలో కష్టాలలో ఉన్నటువంటి గౌడ కుటుంబాలకు అందరి సహకారంతో అండదండగా ఉంటామని అదేవిధంగా కల్లు గీత కార్మికులకు జరిగే ఇబ్బందులను పరిష్కరించడం కోసం ప్రభుత్వంపై కూడా ఒత్తిడి చేస్తామని అన్నివేలలా అందరికీ అందుబాటులో ఉంటూ మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుండి జిల్లా గోప ఆదర్శంగా ఉండడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు అదేవిధంగా ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు కూర శ్రీనివాస్ గౌడ్ గారిని కూడా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి ఎస్ పి ఎస్ ప్రధాన కార్యదర్శి పులి ముత్తిలింగం గౌడ్ ,కోశాధికారి బాలగారి నర్సయ్య గౌడ్, కె ఎస్ పి ఎస్ ప్రధాన కార్యదర్శి కుంభం మహేష్ గౌడ్, కోశాధికారి పరిదుల వెంకటేశ్వర్లు గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అసోసియేషన్ నుండి ప్రధాన కార్యదర్శి గుర్రం వెంకన్న గౌడ్ ,కోశాధికారి రావుల శోభన్ బాబు గౌడ్, కంఠమహేశ్వర సంఘం నుంచి ప్రధాన కార్యదర్శి జలగం రామ్మూర్తి గౌడ్ ,కోశాధికారి ఓం ప్రకాష్ గౌడ్ వివిధ సంఘాల నాయకులు కొండం వసుందర్ గౌడ్, జనార్ధన్ గౌడ్, తండ ప్రభాకర్ గౌడ్, చిరగానీ రమేష్ గౌడ్ ,పెరుమాళ్ళ రమేష్ గౌడ్, కోటగిరి కుమార్ గౌడ్ ,బాబా రాము గౌడ్ ,నగేష్ గౌడ్ ,చీకటి వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తా

## జిట్టెగూడేం గ్రామ సర్పంచ్ బానోత్ బాలు



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 12 ( జనం సాక్షి ) :** ప్రజలందరి సహకారంతో గ్రామ అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తానని జిట్టెగూడేం గ్రామ సర్పంచ్ బానోత్ బాలు నాయక్ అన్నారు. మండలంలోని జిట్టెగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వెనకాల వివో ఏ భవన నిర్మాణానికి సర్పంచ్ బాలు నాయక్ భూమి పూజ చేసి నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణా నికి కృషి చేస్తానని అన్నారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. గ్రామాభివృద్ధికి గ్రామంలోని ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఉప సర్పంచ్ లూనావత్ రజిత రవీందర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు లావుడ్య రవి, మహిళా సంఘం అధ్యక్షురాలు లావుడియా కవిత రాజు, ఉపాధ్యక్షురాలు బాదావత్ సుశీల, కోశాధికారి బానోత్ స్వరూప, లక్ష్మీ, నాయకులు లునావత్ జయపాల్ నాయక్, అజ్మీరా వెంకన్న, బాలు, జయపాల్, సజ్యా, లావుడ్య రవి, రోజా, బానోతు స్వర్ణ, లావుడ్య తిరుపతి, వాంకుడోత్ రవి, లావుడ్య వెంకులు, లాలు,రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# స్వశక్తితో ఎదిగి అభివృద్ధి సాధించాలి

## గ్రామ సర్పంచ్ జోగు సంపత్ కుమార్



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 12 ( జనం సాక్షి ) :** ప్రతి ఒక్కరు ఇతరులపై ఆధార పడకుండా స్వశక్తితో ఎదిగి అభివృద్ధి సాధించాలని సర్పంచ్ జోగు సంపత్ కుమార్ అన్నారు. మండలంలోని మీదికొండ గ్రామంలో కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు పొన్నం పారిజాతం సత్యనారాయ ణ గౌడ్ నూతనంగా ఏర్పాటు చేసిన రవళి టెంట్ హౌస్‌ను గ్రామ సర్పంచ్ జోగు సంపత్ కుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ నాగరబోయిన శ్రీరాములు, టెంట్ హౌస్ ఓనర్ పొన్నం పారిజాతం సత్యనారాయణ, నాయకులు రాజేష్, నరహరి, పొన్నం రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 12(జనం సాక్షి):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 153 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 47, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 42, డీఆర్డీఏకు 13 అర్జీలు రాగా వివిధ శాఖల నుండి 51అర్జీలు వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత సమయంలో పరిష్కార చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రజావాణి అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్,అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డియార్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ వసంత,హౌసింగ్ పిడి విష్ణు వర్ధన్ రెడ్డి, డీఎంఅండ్ హెచ్ ఓ రాజి రెడ్డి కలెక్టరేట్ సూపరిండెంట్ విశ్వప్రసాద్ తదితరులు ప్రజలు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌ని కలిసిన 'సందీప్'
## టీబీ బాధితులకు అండగా ఉంటానన్న కేంద్ర మంత్రి



**పాలకుర్తి. అక్టోబర్ 12 (జనంసాక్షి)** టీబీ ముక్త్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా యునైటెడ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర యువ అంబాసిడర్, "టీబి అడ్వకసి ఫెలో" ఎలమకంటి సందీప్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా టీబీ నిర్మూలన కోసం చేపడుతున్న కార్యక్రమాలు, బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన పోషకాహార సహాయం, ఆర్థిక తోడ్పాటు, మానసిక భరోసా వంటి అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, టీబీ ముక్త్ భారత్ అభియాన్ లక్ష్య సాధనలో ప్రజాప్రతినిధులు, యువత, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములై సమిష్టిగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. సందీప్ వివరించిన అంశాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందిస్తూ, టీబీ బాధితులకు ఆర్థికంగా, మానసికంగా అండగా ఉంటానని, వారి సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. టీబీ నిర్మూలన కోసం యువత చేస్తున్న కృషిని ప్రోత్సహిస్తూ, బాధితులకు అవసరమైన సహాయం అందించడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ప్రాధాన్యమని పేర్కొన్నారు. టీబీ రహిత భారతదేశ నిర్మాణం కోసం ప్రజాప్రతినిధులు, యువత, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వ యంతో ముందుకు సాగాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆకాంక్షించారు.

## అంబటిపల్లి పీహెచ్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు
### ఆటపాటలతో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు వైద్య ఆరోగ్య సిబ్బంది నీరాజనం



**మహదేవపూర్ :అక్టోబర్ 12 (జనంసాక్షి ):** తెలంగాణ సాంస్కృతిక సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంబరాన్నంటాయి. ఉమ్మడి మహదేవపూర్ పలిమెల మండలాల పరిధిలోని అంబటి పెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ తేజావత్ కళ్యాణి ఆధ్వర్యంలో డాక్టర్ జగదీష్ కన్నా అధ్యక్షతన బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే విధినిర్వహణలో ఉండే వైద్యారోగ్య సిబ్బంది ఈ బతుకమ్మ వేడుకల్లో ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతిని ప్రసాదించిన రంగురంగుల పువ్వులతో బతుకమ్మను పేర్చి తెలంగాణ పల్లెలను ప్రతిబింబించే పాటలు పాడుతూ బతుకమ్మ చుట్టూ వలయముగా తిరుగుతూ మహిళలు వచ్చావుగా ఆటపాటలో పాల్గొన్నారు. చేతుల చప్పట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రాంగణం సందడిగా మారింది. ఈకార్యక్రమంలో అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, హెచ్ ఈ ఓ లు ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ వర్కర్లు. పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్‌లో మహిధర్ ప్రతిభ
### 10వ తరగతి విద్యార్థిని సన్మానించిన ఎంపీడీవో మేనక పొడెల్



**దేవరుప్పుల, అక్టోబర్ 12 (జనం సాక్షి)** దేవరుప్పుల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఉప్పుల మహిధర్ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటడంతో ఎంపీడీవో మేనక పొడెల్ విద్యార్థిని సన్మానించి అభినందించారు. రాష్ట్రస్థాయికి ఎదిగి పాఠశాలకు, మండలానికి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. విద్యార్థి ఈ స్థాయికి చేరుకోవడంలో కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఎంపీడీవో అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం 2005 అమలు దినోత్సవం
### కరపత్రాలు ఆవిష్కరించిన మండల అధికారులు



**చెన్నారావుపేట, అక్టోబర్ 12 ( జనం సాక్షి ):** చెన్నారావుపేట మండల కేంద్రంలో స్థానిక మండల అధికారుల చేతుల మీదుగా సమాచార హక్కు చట్టం అలాగే పలు కీలక అంశాలతో కూడిన అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. అక్టోబర్ 12 సోమవారం సమాచార హక్కు చట్టం 2005 అమలు దినోత్సవం సందర్భంగా చెన్నారావుపేట తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, డిప్యూటీ తహసిల్దార్ పవన్ కుమార్, ఎంపీడీవో వెంకట సాయి శివానంద్, ఇతర మండల అధికారులతో కలిసి సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ సభ్యులు రూపొందించిన ప్రత్యేక కరపత్రాలను గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆవిష్కరించారు. సహ చట్టం సొసైటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లెపు ప్రణీత్, జిల్లా మీడియా కన్వీనర్ కల్లెపు గణేష్ ఆధ్వర్యంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో సమాచార హక్కు చట్టం -2005లోని ముఖ్యమైన సెక్షన్లు, రాజ్యాంగ పీఠికతో పాటు సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీ, పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణ మరియు మాదకద్రవ్యాల నివారణ వంటి సమకాలీన సామాజిక అంశాలను పొందుపరిచారు. ఈ సందర్భంగా మండల అధికారులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన ఉంటేనే ప్రభుత్వ పథకాలు, నిధుల వినియోగం పారదర్శకంగా మారుతాయని, ప్రతి ఒక్కరూ ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కరపత్రాల ద్వారా చట్టంలోని ముఖ్య సెక్షన్లు సామాన్యులకు కూడా సులువుగా అర్థమవుతాయని వారు అభిప్రాయపడ్డారు. సొసైటీ సభ్యులు ప్రణీత్, గణేష్ మాట్లాడుతూ అక్టోబర్ 12, 2005 నుండి దేశంలో ఈ చట్టం అమల్లోకి వచ్చిందని ప్రభుత్వ పాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించడం అవినీతిని అరికట్టడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థలు లేదా పనులకు సంబంధించిన సమాచారాన్ని దరఖాస్తు ద్వారా ఎవరైనా సరే సులభంగా తెలుసుకునే హక్కును ఈ చట్టం కల్పిస్తుందని, సాధారణ సమాచారాన్ని దరఖాస్తు చేసిన 30 రోజుల్లోగా అలాగే పౌరుల ప్రాణాలకు లేదా వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయమైతే కేవలం 48 గంటల్లోనే సమాచారం అందించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన మండల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య విద్యావిభాగ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అనిల్ కుమార్



**తొర్రూరు, అక్టోబర్ 12 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ విద్యా విభాగం, స్కాలర్షిప్స్ వితరణ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తొర్రూరు కు చెందిన వజినపల్లి అనిల్ కుమార్ నియామకం పొందారు. ఆదివారం రాష్ట్ర మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొద్దుటూరు గౌరీ శంకర్ సమక్షంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. రెండేళ్ల క్రితం వరకు అనిల్ కుమార్ మహబూబాబాద్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శిగా, సుదీర్ఘకాలం తొర్రూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా పనిచేశారు. నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థులకు అండగా నిలిచే విద్యా కమిటీలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అనిల్ కుమార్ కు ప్రాతినిధ్యం లభించడం ఈ ప్రాంతంలో పేద ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్షిప్ల మంజూరు కోసం ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతల అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనారాయణకు, ఉపాధ్యక్షులు గౌరీ శంకర్ తోపాటు జిల్లా బాధ్యులకు ధన్యవాదాలు తెలిపారు. పేద ఆర్యవైశ్య విద్యార్థుల ఉన్నత చదువులకు చేయూతనిచ్చేందుకు దాతృత్వం కలిగిన ప్రతి ఒక్కరు తగిన ఆర్థిక సహకారాన్ని అందజేసేందుకు స్వచ్ఛందంగా రాష్ట్ర మహాసభ విద్యా కమిటీని సంప్రదించాలని అనిల్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా సంఘ అధ్యక్షులు తల్లాడ వెంకట రామారావు, కోశాధికారి సామ రామూర్తి, చాంబర్ ఆఫ్ కామర్స్ తొర్రూరు అధ్యక్షులు మచ్చ సురేష్, కోశాధికారి చిదిరాల శ్రీనివాస్, తాటికొండ సతీష్ పాల్గొన్నారు.

# ప్రజావాణికి రెండు ఫిర్యాదులు




**నల్లబెల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు ఫిర్యాదులు అందాయి. కొండైల్‌పల్లె గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న బర్ల ఫామ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, దోమల బెడదతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అదే గ్రామానికి చెందిన మామిండ్ల వీరారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. సంబంధిత ఫామ్ యజమాని తప్పుడు సంజాయిషీ పత్రాన్ని సమర్పించారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, గ్రామస్థులకు ఇబ్బందులు కలగకుండా బర్ల ఫామ్‌ను అక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే మామిండ్ల వీరయ్యపల్లె గ్రామానికి చెందిన అనుముల అనిత తాను కొనుగోలు చేసిన ఇంటి స్థలాన్ని తన పేరు మీద నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శిని పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవడంతో పాటు, తాను కొనుగోలు చేసిన ఇంటి స్థలాన్ని తన పేరు మీద నమోదు చేసేలా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి రమణారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, దరఖాస్తుల రూపంలో సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీఓ రవి, ఏవో బన్న రజితతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హద్దులపై కదలికేది? రోడ్డు విస్తరణ పనులపై కొనసాగుతున్న అనుమానాలు

## • సింగరేణి భూముల సరిహద్దులపై తేలని స్పష్టత • సంయుక్త సర్వే ఎప్పుడు.. అధికారుల స్పందన ఏదీ?




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి పట్టణంలో రోడ్డు వెడల్పు పనుల నేపథ్యంలో సింగరేణి భూముల హద్దుల అంశం చర్చనీయాంశంగా మారింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఎస్సిసిఎల్ హద్దు పిల్లర్ల ఆధారంగా ప్రస్తుతం భూముల సరిహద్దులను నిర్ధారించారా? లేదా? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది. అంబేద్కర్ సెంటర్ నుంచి సుభాష్ కాలనీ వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో హద్దులపై అనుమానాలు వ్యక్తమవుతుండగా, మున్సిపల్, సింగరేణి అధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఈ అంశంపై గతంలోనే ప్రశ్నలు తెరపైకి వచ్చినప్పటికీ, హద్దుల వాస్తవ పరిస్థితిని తేల్చేందుకు సంయుక్త సర్వే నిర్వహించాలన్న డిమాండ్ ప్రాధాన్యం సంతరించుకుంది.

**పిల్లర్లను మరుగున పడేశారా.. పరిశీలించేదెవరు?**

గతంలో సింగరేణి సంస్థ తన భూముల సరిహద్దులను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన హద్దు పిల్లర్లు ప్రస్తుతం ఎక్కడెక్కడ ఉన్నాయి? వాటిలో ఎన్ని కనిపిస్తున్నాయి? మరికొన్ని చోట్ల కనిపించకపోవడానికి కారణమేంటి? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. రోడ్డు విస్తరణ పనులు చేపట్టే ముందు పాత భూ రికార్డులు, సరిహద్దుల మ్యాపులు, క్షేత్రస్థాయి గుర్తులను అధికారులు పరిశీలించారా అన్నది తెలియాల్సి ఉంది. హద్దు పిల్లర్లు తొలగిపోయినట్లు ఎక్కడైనా నిర్ధారణ అయితే, వాటి పరిస్థితిపై విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**అభివృద్ధి పనులే.. కాని, భూ వివాదాలకు దారితీయొద్దు!**

పట్టణంలో రహదారుల విస్తరణతో ప్రజలకు ప్రయోజనం కలగాల్సిందే. అయితే ఆ పనుల క్రమంలో ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన భూముల సరిహద్దులపై సందేహాలు తలెత్తడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు విస్తరణలో భాగంగా ఏ మేరకు భూమి వినియోగంలోకి వస్తోంది? సింగరేణి భూముల పరిధి ఎక్కడి వరకు ఉంది? పనులు అధికారిక హద్దులకు అనుగుణంగానే జరుగుతున్నాయా? అన్న అంశాలను సంబంధిత శాఖలు స్పష్టం చేయాలి. హద్దులు దాటినట్లు వస్తున్న ఆరోపణలను నిర్ధారించకుండా తప్పు జరిగిందని చెప్పలేం. అదే సమయంలో అనుమానాలను నివృత్తి చేయకుండా వదిలేయడమూ సరికాదు.

**సింగరేణి మౌనం.. మున్సిపల్ అధికారుల బాధ్యత ఏది?**

సంస్థ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత సింగరేణి అధికారులపై ఉంది. మరోవైపు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న మున్సిపల్ అధికారులు కూడా భూ సరిహద్దుల విషయంలో స్పష్టత ఇవ్వాల్సి ఉంది. పాత హద్దు పిల్లర్ల వివరాలు, భూ రికార్డులు, ప్రస్తుతం జరుగుతున్న పనుల మధ్య సమన్వయం ఉందా లేదా అన్నది వెల్లడించాలి. ఈ రెండు శాఖల అధికారులు పరస్పరం బాధ్యతలు బదిలీ చేసుకోకుండా, వాస్తవాలను ప్రజల ముందుంచాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**సంయుక్త సర్వేతోనే అనుమానాలకు తెర!**

మున్సిపల్, సింగరేణి అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తేనే ఈ వ్యవహారంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పాత రికార్డులను పరిశీలించి, భూముల సరిహద్దులను నిర్ధారించి, హద్దు పిల్లర్ల ప్రస్తుత స్థితిని నమోదు చేయాలి. అవసరమైతే రెవెన్యూ శాఖ సహకారంతో సర్వే నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలి. సరిహద్దుల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు ఎలాంటి భూ వివాదాలకు తావులేకుండా కొనసాగడం ముఖ్యం. మరి అధికార యంత్రాంగం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి సంయుక్త సర్వేకు ముందుకొస్తుందా? లేక రెండు దశాబ్దాల నాటి హద్దు పిల్లర్ల వ్యవహారం ప్రశ్నగానే మిగిలిపోతుందా? అన్నది వేచి చూడాలి.

# తులం బంగారం ఇవ్వరా..? కాంగ్రెస్ సర్కారుపై ఎమ్మెల్యే పాడి ఫైర్

## కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు బంగారం ఇవ్వాలని డిమాండ్ - 24 గంటల కరెంటు, కాళేశ్వరం నీళ్లు విడుదల చేయాలి

## దళిత బంధు రెండో విడత, డబుల్ బెడ్రూమ్ సదుపాయాలపై ప్రభుత్వాన్ని నిలదీత



**కమలాపూర్, అక్టోబర్ 12 (జనం సాక్షి ) :-** కమలాపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా కొనసాగించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే గొప్ప ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేశారని తెలిపారు. ఈ పథకాల ద్వారా వేలాది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రూ.1,00,116 ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం అందిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బంగారం ధరలు పెరగడంతో ఆ పథకాన్ని రేవంత్ రెడ్డి అటకెక్కించారని ఎద్దేవా చేశారు. చేతకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం రైతులకు కేవలం 7 గంటలే విద్యుత్ అందిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో పాటు కాళేశ్వరం ద్వారా సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం లో రైతులు నవ్వుతూ పంటలు పండిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని కన్నీరు పెడుతున్నారని అన్నారు. దళిత కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది స్వయం ఉపాధితో గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రెండో విడత దళిత బంధును నిలిపివేయడంతో అర్హులైన దళిత కుటుంబాలు ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. దళితుల అభ్యున్నతిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రెండో విడత దళిత బంధును అమలు చేసి అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. గర్భిణులు, నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాలు తల్లీబిడ్డలకు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఆడపిల్ల పుడితే రూ.12,000, మగపిల్లాడు పుడితే రూ.13,000 ఆర్థిక సహాయం అందించే పథకాల ప్రయోజనాలు ప్రజలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నిలిపివేసిన పథకాలను వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేసినప్పటికీ, కనీస మౌలిక సదుపాయాలు లేకుండా పంపిణి చేసారు అని అన్నారు. వారంలోనే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నెలలు గడుస్తున్న కూడా దున్నపోతుమీద వర్షం పడ్డదన్న చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. వెంటనే అసంపూర్తిగా ఉన్న పనులకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు. కేసీఆర్ హయాంలో కమలాపూర్ బస్‌స్టాండ్ నిర్మాణ పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తికాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం తక్షణమే అవసరమైన నిధులు మంజూరు చేసి బస్‌స్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, పిఏసిఎస్ చైర్మన్ పేరాల సంపత్ రావు,కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం శక్తివంతమైంది



**పాలకుర్తి, అక్టోబరు12 (జనంసాక్షి) :** ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సమాచార హక్కు చట్టం ఒక శక్తివంతమైన వారధిలా పని చేస్తోందని ఎంపీడీవో వర్కల వేధవతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం అవరనలో సహచట్టం అవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఎంపీడీవో వేదవతి కేకకట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ అధికారి స.హ.చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రజల కోరిక సమాచారాన్ని నిర్ణీత కాలపరిమితిగా పారదర్శకంగా అందించాలని సూచించారు. చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటేనే జవాబుదారి తనంతో పని చేయాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో స.హ చట్టం పరిరక్షణ కమిటి మండల అధ్యక్షుడు గడ్డం వరుణ్ బాబు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎడవెల్లి సోంచందర్, రమేష్, ఎడవెల్లి రమేష్. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

## కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని, ఆ సంబరాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాల గోడ ప్రకటనను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. తరతరాల సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, గెజిటెడ్ సంఘం అధ్యక్షులు విజయలక్ష్మి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు

## మహిళా సమాఖ్య భవనంతో మహిళలకు ప్రయోజనాలు





**నెన్నెల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** నెన్నెల మండలంలోని గుండ్లసోమారం గ్రామంలో సోమవారం సర్పంచ్ సింగతి రాణి, తిరుపతి ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య భవనానికి ముగ్గు వేశారు. గ్రామంలో మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంలో మహిళా సమాఖ్య భవనం కీలకంగా ఉపయోగపడనుంది. ఈ భవనం ద్వారా మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు పొదుపు, రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు వీలుంటుంది. మహిళలు సంఘటితంగా ఉంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి, తమ సమస్యలను చర్చించుకోవడానికి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడానికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుంది. గ్రామీణ మహిళల సాధికారతకు, ఆర్థిక స్వావలంబనకు మహిళా సమాఖ్యలు దోహదపడతాయని, మహిళలు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని స్థానికులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాగటి వెంకటేష్, వార్డు సభ్యులు రత్నం విజయ, దుగుట కుమార్, దుర్గం పోషం, గ్రామ పంచాయతీ కార్యదర్శి రంజిత్, సహాయ ఇంజనీర్ మహేందర్, క్లస్టర్ సమన్వయకర్త శ్రీనివాస్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మహేశ్వరి, సహాయకురాలు కవితతో పాటు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### హనుమకొండలో బిజెపి ఆధ్వర్యంలో

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



**హనుమకొండ (ప్రతినిధి అక్టోబర్ 12 )జనం సాక్షి) :**బీజేపీ హన్మకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి మరియు మహిళా మోర్చా అధ్యక్షురాలు రత్న లక్ష్మి ఆధ్వర్యంలోమణిపూర్ కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ అంగోంచా బీమల్ అకౌజం, 11 మంది ఆడబిడ్డలను లైంగిక వేధింపులు చేసినటువంటి కాంగ్రెస్ ఎంపీ పైన ఒక్క మాట కూడా మాట్లాడకుండా, తగిన చర్యలు తీసుకోకుండా అతనికి వత్తాసు పలుకుతూ ఉన్నటువంటి రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ తన కాంగ్రెస్ పార్టీ ఎంపీ 11 మంది అమ్మాయిల లైంగిక వేధింపులు చేసిన ఎంపీని వెంటనే సస్పెండ్ చేయాలనీ, డిమాండ్ చేయడం జరిగింది,సస్పెండ్ చేసే వరకు ఇలాంటి వినూత్నమైన నిరసనలు జిల్లా, రాష్ట్ర, దేశ వ్యాప్తంగా చేస్తామని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పులి సరోత్తం రెడ్డి, ఉమ్మడి మాజి జిల్లా అధ్యక్షులు దొంతి దేవేందర్ రెడ్డి, రావుల కిషన్,గిరిజన నాయకుడు నాను నాయక్,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్. సంద్ర మధు,ఉపాధ్యక్షులు, బైరీ శ్రవణ్, కూతురు రాజు, ఆకుల శ్రీకాంత్,నార్మెట్ట శ్రీనివాస్ ,కార్యదర్శులు అరణ్య రెడ్డి,జరీనా,కొండం రవీందర్ రెడ్డి,యువమోర్చ అధ్యక్షుడు పున్నం వేణు,మాజి కార్పొరేటర్ గుజ్జుల వసంత, మహేందర్, డివిజన్ అధ్యక్షులు ,సీనియర్ నాయకులు కార్యకర్తలు, యువమోర్చ నాయకులు పాల్గొనడం జరిగింది.

## అమ్మవారికి పట్టు చీరలు అందజేసిన సమ్మి గౌడ్



**కేసముద్రం అక్టోబర్ 12 (జనం సాక్షి):** కేసముద్రం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని ధన్నసరి 2వ డివిజన్ లో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో అమ్మవారికి 10 పట్టు చీరలు,భారీ గజమాల,నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.చిన్నతనంలో ఆడుతూ, పాడుతూ పెరిగిన స్వగ్రామంపై తనకున్న మమకారాన్ని సమ్మయ్య గౌడ్ చాటుకున్నారు. జన్మభూమిలో గ్రామదేవతకు సేవ చేసుకునే అవకాశం లభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.అమ్మవారి పూజ కు విచ్చేసిన భక్తులతో, పెద్దలతో తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. భవిష్యత్‌లో తను ఆడి, పాడి పెరిగిన గ్రామానికి తనవంతు సహాయం తను బ్రతికినంత కాలం ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు... శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్చావాల సందర్భంగా అమ్మవారికి 10 రోజులకు పట్టు వస్త్రాలు పెట్టి సేవ చేసే గొప్ప అవకాశం రావడం, ఈ సందర్భంగా మన వాళ్లందరిని కలిసే అవకాశం కల్పించిన కౌన్సిలర్ దారావత్ కిషోర్‌కి,కమిటీ అధ్యక్షులు సురేష్ మరియు ప్రతీ కమిటీ బాధ్యుడికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ధారావత్ కిషోర్,గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండా సురేష్,డైరెక్టర్ చి. యాదగిరి,ఉత్సవ కమిటీ సభ్యులు వేం అజిత్ రెడ్డి, వేం దిలీప్ రెడ్డి, అనుమునగంటి రాజు,కొసని శ్రీధర్ రెడ్డి,మర్రి నర్సింహా రెడ్డి,గోపాల మల్లారెడ్డి,పింగిలి మలయ్య పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు



**ములుగు ప్రతినిధి,అక్టోబర్ 12(జనంసాక్షి).** ప్రజావాణిలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యలకు సంబంధించి 05, ఇందిరమ్మ ఇళ్లకు 01, పింఛన్లకు 01, ఉద్యోగాలకు 02, ఇతర శాఖలకు సంబంధించి 05, మొత్తం 14 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలకు ఆహ్వానించినా పిలవలేదంటూ రాద్ధాంతమా?

### వేటా సంస్థపై విమర్శలు చేసే ముందు మీ గతాన్ని గుర్తు చేసుకోండి

### బీఆర్ఎస్ కౌన్సిలర్ల విమర్శలకు మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజనీరాజశేఖర్ ఘాటు కౌంటర్



**తొర్రూరు, అక్టోబర్ 12 (జనం సాక్షి) :**తొర్రూరు పట్టణంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేస్తున్న విమర్శలను మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజనీరాజశేఖర్ తీవ్రంగా ఖండించారు. కౌన్సిలర్లను వేదికపైకి ఆహ్వానించినప్పటికీ, తమను పిలవలేదంటూ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉంది వేదికపైకి ఎన్నిసార్లు పిలవాలి? ఆహ్వానించినా పాల్గోని పాల్గొనలేదు అని , ఇప్పుడు పిలవలేదని రాద్ధాంతం చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. కౌన్సిలర్లుగా గతంలో ఎన్నో మున్సిపల్ కార్యక్రమాల్లో వేదికపై పాల్గొన్న మీరు, ఇప్పుడు బతుకమ్మ వేడుకల విషయంలోనే ఎందుకింత వివాదం చేస్తున్నారని నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఏం జరిగిందో తొర్రూరు ప్రజలందరూ గమనిస్తున్నారని, వాస్తవాలను వక్రీకరించి రాజకీయ విమర్శలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

**వేటా సంస్థపై విమర్శలు చేయడం ఎందుకు?**

బతుకమ్మ వేడుకల సందర్భంగా వేటా సంస్థపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేస్తున్న విమర్శలపై స్పందిస్తూ, వేటా సంస్థ గురించి వేదికపై ప్రత్యేకంగా ఏమైనా మాట్లాడామా? ఆ సంస్థ పేరుతో స్టేజిపై బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రచారం చేశామా? ప్రైవేటు సంస్థకు ప్రచారం కల్పించామని ఆరోపిస్తున్నప్పుడు అందుకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. మహిళల పండుగైన బతుకమ్మను రాజకీయ వివాదాల్లోకి లాగకుండా, ఏవైనా లోపాలుంటే ఆధారాలతో ప్రశ్నించాలని సూచించారు.

**గతంలో మీ ప్రభుత్వ హయాంలో ఉషా దయాకర్ రావు గారు వేదికపై ఎందుకు పాల్గొన్నారు?**

బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఇతరులపై విమర్శలు చేసే ముందు తమ గతాన్ని కూడా గుర్తు చేసుకోవాలని సోమ రజనీరాజశేఖర్ అన్నారు. గతంలో మీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉషా దయాకర్ రావు గారు అధికారిక కార్యక్రమాల్లో వేదికపై ఎందుకు పాల్గొన్నారు మరియు బిఆర్ఎస్ నాయకులు ఎందుకు పాల్గొన్నారు? అప్పుడు అది ప్రభుత్వ కార్యక్రమం కాదా? గతంలో బిఆర్ఎస్ నాయకులు వేదికపై పాల్గొన్నప్పుడు అభ్యంతరం చెప్పని వారు, ఇప్పుడు మాత్రం అదే అంశంపై విమర్శలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. గతంలో అనుసరించిన విధానాలకు, ప్రస్తుతం చేస్తున్న ఆరోపణలకు మధ్య ఉన్న తేడాను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

**కమిషనర్‌ను కాంగ్రెస్ ఏజెంట్ అనడం బాధ్యతారాహిత్యం**

మున్సిపల్ కమిషనర్‌ను కాంగ్రెస్ పార్టీ ఏజెంట్‌గా అభివర్ణించడం సరైన పద్ధతి కాదని వైస్ చైర్మన్ స్పష్టం చేశారు. అధికారుల పనితీరుపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, విచారణ కోరాలని సూచించారు. ఆధారాలు లేకుండా అధికారులకు రాజకీయ ముద్ర వేయడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమని పేర్కొన్నారు.మున్సిపల్ నిధుల ఖర్చులపై ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రజాధనం వినియోగంలో పారదర్శకత తప్పనిసరి అని అన్నారు. అయితే ఆరోపణలు చేసేటప్పుడు వాస్తవాలు, ఆధారాలు ఉండాలని స్పష్టం చేశారు. బతుకమ్మ ఏర్పాట్లపై మీరు కూడా భాగస్వాములే కదా అది మరిచారా.ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఎవరు ఏం మాట్లాడుతున్నారు, ఈ కార్యక్రమంలో వాస్తవంగా ఏం జరిగిందో ప్రజలకు తెలుసు. విమర్శలు చేయాలంటే ఆధారాలతో చేయాలి. రాజకీయ ఆరోపణల కంటే ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి. బతుకమ్మ వంటి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగలను రాజకీయ వివాదాలకు వేదికగా మార్చవద్దు" అని స్పష్టం చేశారు.

## శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోస్టర్ ఆవిష్కరణ

### సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలి

### పోస్టర్‌ను ఆవిష్కరించిన గౌడ సంఘం యూత్ అసోసియేషన్ నాయకులు



**గూడూరు,అక్టోబర్12(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను సంఘం నాయకులు, యువకులు కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 16న,శుక్రవారం గూడూరు మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమానికి మండలంలోని గౌడ సంఘం నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. సందర్భంగా వారు మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప వీరుడని కొనియాడారు. ప్రజల్లో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను నేటి యువతకు తెలియజేయాలని, ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కప్పల అనిల్ కిషోర్ గౌడ్,ఉపాధ్యక్షులు రామకృష్ణ గౌడ్,గౌడ కుల పెద్దలు పానుగంటి వీరస్వామి గౌడ్,పొన్నం వెంకన్న గౌడ్, పంజాల రామస్వామి గౌడ్,సమ్మెట సుధాకర్ గౌడ్,బుర్ర జోగయ్య గౌడ్,సమ్మెటి సాంబయ్య గౌడ్, మరియు గౌడ యూత్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కన్న వెంకటేశ్వర్లు గౌడ్, కార్యదర్శులు రాజు, చాణక్య,సుధా,బాలగోని శ్రీధర్ గౌడ్, గోపగాని యాదగిరి గౌడ్, సమ్మెట సురేందర్ గౌడ్, పుల్లూరు శ్రీనివాస్ గౌడ్,ఎలికట్ట వెంకన్న గౌడ్, పాల్గొన్నారు.

# మిల్స్ కాలనీ పీఎస్ పరిధిలో "ఆపరేషన్ చెబుత్రా"

### 10 బైక్‌లు స్వాధీనం, 28 మందిపై కేసులు నమోదు

### అనంతరం కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ : ఇన్స్పెక్టర్ కర్రె స్వామి వెల్లడి



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 12 (జనం సాక్షి)** వరంగల్ పోలీస్ కమిషనర్ యన్.శ్వేత ఐపిఎస్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో "ఆపరేషన్ చెబుత్రా" నిర్వహించి 10 బైక్ లు స్వాధీనం చేసుకొని, 28 మందిని అదుపులోకి తీసుకొని, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో మిల్స్ కాలనీ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై సంచరించడం, న్యూసెన్స్ సృష్టించడం వంటి కార్యకలాపాలను నియంత్రించే లక్ష్యంతో నిర్వహించే "ఆపరేషన్ చెబుత్రా" కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి అజాం జాహి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్, వరంగల్ పరిధిలో నిర్వహించడం జరిగిందిఈ ఆపరేషన్‌లో భాగంగా చింతల్, అబ్బనికుంట, లేబర్ కాలనీ, ఫోర్ట్ వరంగల్, శివనగర్, ఎస్.ఆర్.ఆర్. తోట, ఉర్సు గుట్ట, కరీమాబాద్, ఉర్సు, శంభునిపేట, రంగశాయిపేట తదితర ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరుగుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న 28 మందిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అందులోబహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి దొరికిన 15 మందిపైన సిపి యాక్ట్ సెక్షన్ 70(బి) కింద కేసులు నమోదు చేశారు. మరో 13 మందిపై ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ న్యూసెన్స్‌కు పాల్పడినందుకు సెక్షన్ 21, 70, 76 కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 10 మోటార్ సైకిళ్లు, 24 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఆదేవిదంగా అదుపులోకి తీసుకున్న 28 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ కూడా నిర్వహించి అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా బయట తిరగడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, న్యూసెన్స్‌కు పాల్పడటం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వారికి వివరించారు."ఆపరేషన్ చెబుత్రా" ఒక నిరంతర ప్రక్రియ అని, ఇకనుండి ఈ కార్యక్రమం ప్రతిరోజూ కొనసాగుతుందని, ప్రజలు రాత్రి వేళలో అవసరమైతే తప్ప బయట తిరుగవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విదంగా ఎవరయినా ప్రవర్తించినా వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ కర్రె స్వామి ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ కర్రె స్వామి తో పాటు ఇతర సర్కిల్ ఇన్స్పెక్టర్లు మంగిలాల్, ఓ.శ్రీనివాస్, ఐ శ్రీనివాస్, శ్యాంసుందర్, పలువురు ఎస్సై లు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, త్వరిత స్పందన బృందం ఇతర పోలీసు సిబ్బంది మొత్తం 40 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు గృహాల కేటాయింపు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి ఏరియా పరిధిలోని కార్మికులకు గృహాల కేటాయింపు ప్రక్రియ సోమవారం పారదర్శకంగా పూర్తయింది. స్థానిక గని రక్షణ కేంద్రంలో ఏరియా యాజమాన్యం క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించింది. టి–2, సుభాష్ కాలనీ, 1000 క్వార్టర్లు, రామప్ప కాలనీల్లో ఖాళీగా ఉన్న 101 గృహాలకు 710 మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సిలింగ్ లో 96 మంది కార్మికులు తమకు నచ్చిన గృహాలను ఎంపిక చేసుకున్నారు. మరో 5 గృహాలు మిగిలి ఉన్నాయని సిబ్బంది అధికారి శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం కార్యదర్శి రమణ్ పాఠక్, ఏజీఎం రవికుమార్, సీనియర్ పిఓ సాయికృష్ణ, ఏఐటీయూసీ నాయకులు మోటపలుకుల రమేష్, ఐఎన్టీయూసీ నాయకులు మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ యుగంలో కనిపించేవన్నీ నమ్మొద్దు: ఎస్సై కోటేశ్వరరావు




**గంగారం అక్టోబర్ 12 (జనం సాక్షి)** ఏ ఐ యుగంలో సోషల్ మీడియాలో, స్మార్ట్ ఫోన్ లో కనిపించే ప్రతీదీ నిజమని నమ్మి మోసపోవద్దని గంగారం ఎస్సై కోటేశ్వరరావు గంగారం మండల ప్రజలను హెచ్చరించారు. బతుకమ్మ, దసరా పండుగలు సమీపిస్తున్న వేళ సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో రంగంలోకి దిగారని తెలిపారు. పండుగ ఆఫర్ల పేరుతో ప్రజలను మోసం చేయడానికి అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.

**పండుగ ఆఫర్ల పేరుతో ఇలా మోసం చేస్తున్నారు**

1. బతుకమ్మ చీరలు, దసరా బంపర్ ఆఫర్: మీకు బతుకమ్మ చీర వచ్చింది, దసరా లక్కీ డ్రాలో మీకు బైక్, కారు గెలుచుకున్నారంటూ వాట్సాప్ లో లింకులు పంపుతున్నారు. ఆ లింక్ క్లిక్ చేయగానే మీ ఫోన్ హ్యాక్ అయ్యి బ్యాంక్ అకౌంట్ ఖాళీ అవుతుంది. 2. ఆన్లైన్ షాపింగ్ మోసాలు: దసరాకు బట్టలు, బంగారం తక్కువ ధరకే ఇస్తామంటూ నకిలీ వెబ్ సైట్ లు, ఇన్స్టాగ్రామ్ పేజీలు పెడుతున్నారు. డబ్బులు కట్టిన తర్వాత వస్తువు రాదు, ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేస్తారు. 3. ఏఐ తో నకిలీ వీడియో కాల్స్: ఏఐ టెక్నాలజీతో మీ బంధువుల గొంతు, ముఖంతో వీడియో కాల్ చేసి "పండుగకు డబ్బులు కావాలి, అత్యవసరంగా ఫోన్ పే చేయండి" అని అడుగుతున్నారు. ఇలాంటివి నమ్మి చాలా మంది మోసపోతున్నారు. తొందరపడి ఏ లింకును క్లిక్ చేసినా, ఓటిపి చెప్పినా ఒక్క నిమిషంలో మీ కష్టార్జితం మాయమవుతుందని, తస్మాత్ జాగ్రత్త అని ఎస్సై సూచించారు. ప్రతి విషయంలో జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని, లేనియెడల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కు కాల్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

# మంత్రి సీతక్క విజ్ఞప్తికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం

- **ములుగులో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణకు రూ.3 కోట్లు మంజూరు**
- **సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**



**ములుగు ప్రతినిధి,అక్టోబర్ 12(జనంసాక్షి).** ములుగు నియోజకవర్గంలో ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి మేరకు ఇంధన శాఖ ఈ నెల 8న ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 32 జారీ చేసింది. నివాస గృహాల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భద్రతాపరమైన సమస్యలను మంత్రి సీతక్క ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదాల ముప్పును తగ్గించేందుకు విద్యుత్ లైన్లను మార్చాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి సీతక్క విజ్ఞప్తికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం రూ.3 కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులకు ఆమోదం తెలిపింది. ఆర్థిక శాఖ సమ్మతితో జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం పనుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి సీతక్క చొరవతో మంజూరైన ఈ నిధులతో విద్యుత్ లైన్ల మార్పు పనులు చేపట్టనున్నారు. పనులు పూర్తయితే ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లతో ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గి, ప్రజలకు భద్రత పెరగనుంది. దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి సీతక్కకు ములుగు నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# రాంలీలా కార్యక్రమానికి భారీ విరాళం



**బెల్లంపల్లి, అక్టోబర్ 12, (జనంసాక్షి)** బెల్లంపల్లి పట్టణంలో రాంలీలా కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ భారీ విరాళం అందజేశారు. రానున్న దసరా పండుగ సందర్భంగా బెల్లంపల్లి నంబర్–1 గ్రౌండ్‌లో నిర్వహించనున్న రామ్‌లీలా కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో రూ.1,00,116 చెక్కును హిందూ ఉత్సవ కమిటీకి అందజేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఢిల్లీ పర్యటనలో ఉన్న నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సతీష్, మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమరి సూరిబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ చేతుల మీదుగా హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు కోడి రమేష్, నగేష్, బాల సంతోష్, నరేష్‌లకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ చిలుముల శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మునిమంద రమేష్, కంకటి శ్రీనివాస్, బండి రాము, కొత్తపల్లి శ్యామ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి గెల్లి జయరాం, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి అఫ్జల్, పట్టణ ఉపాధ్యక్షుడు లెంకల శ్రీనివాస్, మత్తమరి శ్రీనివాస్, ఎండీ వజీయార్, ఎండి వాజిద్, నాగేందర్, అచ్చే సాయికిరణ్, రామిల్ల ప్రదీప్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా రవాణా శాఖ కార్యాలయ శాశ్వత భవనానికి స్థల పరిశీలన

### చింతగట్టు క్యాంపులో ఎస్సారెస్పీ భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 12 (జనం సాక్షి) :**హనుమకొండ జిల్లా రవాణా శాఖ కార్యాలయ శాశ్వత భవనానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సోమవారం స్థల పరిశీలన చేశారు. రవాణా, విద్యుత్, ఎస్సారెస్పీ శాఖల అధికారులతో కలిసి చింతగట్టు క్యాంపులో ఎస్సారెస్పీ భూములను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం అక్కడ కొనసాగుతున్న రవాణా శాఖ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. చింతగట్టు క్యాంపులో విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన ఉన్న ఎస్సారెస్పీ భూములను జిల్లా కలెక్టర్ పరిశీలించి జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి శాశ్వత భవనం ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటుతో పాటు ఆధునిక డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించి, కేటాయించే అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలన చేశారు. రవాణా శాఖ కార్యాలయం ఏర్పాటుకు ఏడు ఎకరాల భూమి అవసరమని రవాణా శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. చింతగట్టు క్యాంపులోని ప్రత్యామ్నాయ స్థలాన్ని మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుబాటులో ఉన్న భూమి విస్తీర్ణం, అనుకూలత వంటి అంశాలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేష్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి జనార్ధన్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఈ ఈ మంగీలాల్,డీఈ రవి, హసన్ పర్తి తహసీల్దార్ కిరణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎంపీ బిమోల్‌ను సస్పెండ్ చేయాలి: మహిళా మోర్చా



**నిర్మల్ టౌన్ : అక్టోబర్ 12,(జనంసాక్షి )** మహిళా విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ బిమోల్‌ను పార్టీ నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలని మహిళా మోర్చా జిల్లా ఇన్‌చార్జి నల్లుల్లా సంగీత డిమాండ్ చేశారు. ఈ మేరకు నిర్మల్ పట్టణంలోని శివాజీ చౌక్‌లో మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ, బిమోల్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. తెలంగాణ మహిళా మోర్చా అధ్యక్షురాలు డా. మేకల శిల్పారెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంగీత మాట్లాడుతూ.. మహిళా విద్యార్థులపై వేధింపుల ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు బొప్పరపు సత్యవతి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల కల్పన, అలివేలు మంగ, మమత, తోకల సరస్వతి, శిరీష, దీపిక తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్‌లో విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులు: ఎంఈఓ శ్రీనివాస్



**తాండూర్, అక్టోబర్ 12(జనం సాక్షి)** దసరా సెలవులను పురస్కరించుకుని విద్యార్థుల సౌకర్యార్థం తాండూరు మండలంలో ప్రత్యేక ఆధార్ నమోదు, అప్‌డేట్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఆధార్ వివరాలను సరిచేసుకోవడానికి ఈ సెలవుల సమయం ఎంతో అనుకూలమైనదని ఆయన పేర్కొన్నారు.మండలంలోని విద్యార్థుల కోసం రెండు ప్రధాన కేంద్రాలలో ఈ క్యాంపులను అందుబాటులోకి తెచ్చినట్లు ఎంఈఓ వివరించారు. తాండూరులోని మండల వనరుల కేంద్రం లో ఒక క్యాంపు, అలాగే తాండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మరో ఆధార్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థుల ఆధార్ కార్డులలో పేరు, పుట్టిన తేదీ, చిరునామా, మొబైల్ నంబర్ తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సవరించుకోవడానికి, లేదా కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, స్కాలర్‌షిప్‌లు, విద్యా సంబంధిత సేవలకు ఆధార్ వివరాలు అత్యంత కీలకమైనందున తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పిల్లల ఆధార్ వివరాలను అప్‌డేట్ చేయించుకోవాలని ఎంఈఓ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## సింగరేణి కార్మిక గర్జన సభను విజయవంతం చేయాలి

### మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపు



**బెల్లంపల్లి, అక్టోబర్ 12, (జనంసాక్షి)** గోదావరిఖనిలో రేపు నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు. సింగరేణి గర్జన సభ నేపథ్యంలో మంగళవారం బెల్లంపల్లి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సభకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి పట్టణ బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, టీబీజీకేఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గంగా పోచమ్మ జాతరకు ఏర్పాట్ల పరిశీలన

### భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు.. వలల్లోకి వెళ్లొద్దు, కొబ్బరికాయలు వేయొద్దు

### గ్రామ యువకులకు పంచాయతీ, వీడీసీ సూచనలు





**దిలావర్‌పూర్, అక్టోబర్ 12, (జనం సాక్షి):** మండలంలోని సాంగ్వి గ్రామంలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న మహా గంగా పోచమ్మ (గంగా నీళ్ల) జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీ, గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) సూచించాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు గంగా నదిలో పుణ్యస్నానాలు ఆచరించనున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించారు.

**జాతర ఏర్పాట్ల పరిశీలన**

జాతర నిర్వహణపై అడెల్లి పోచమ్మ ఆలయ ఈవో భూమయ్య, మాజీ ఆలయ కమిటీ చైర్మన్లు భోజ గౌడ్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వర్, పత్తి రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాధవరావు, దిలావర్‌పూర్ ఎస్సై రవీందర్, సాంగ్వి సర్పంచ్ రుక్మవ్వ, సుభాష్‌రావు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, వీడీసీ సభ్యులు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గంగా నది వద్దకు వెళ్లి అక్కడ ఉన్న సౌకర్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

**జాతర సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రధానంగా దృష్టి సారించారు: వీధి దీపాలు:** తెల్లవారుజాము నుంచే భక్తులు గంగా స్నానాలకు వచ్చే అవకాశం ఉండటంతో రహదారుల వెంట వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.**స్నానాల వద్ద భద్రత:** గంగా నదిలో స్నానాలు ఆచరించే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

**రాకపోకల సౌకర్యం:** జాతరకు వచ్చే భక్తుల రాకపోకలకు ఆటంకాలు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి.

**సమన్వయం:** ఆలయ కమిటీ, పోలీసు శాఖ, గ్రామ పంచాయతీ, వీడీసీ సభ్యులు సమన్వయంతో పనిచేసి జాతరను ప్రశాంతంగా నిర్వహించాలి. వలల్లోకి వెళ్లొద్దు.. కొబ్బరికాయలు వేయొద్దు జాతర సందర్భంగా గ్రామ యువకులు క్రమశిక్షణ పాటించాలని గ్రామ పంచాయతీ, వీడీసీ సభ్యులు సూచించారు. కొందరు యువకులు వలల్లోకి వెళ్లి ఇబ్బందులు కలిగిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొన్న నేపథ్యంలో ఎవరూ వలల్లోకి వెళ్లి ఇబ్బందులు సృష్టించరాదని స్పష్టం చేశారు. అలాగే వలల్లోకి కొబ్బరికాయలు వేయకూడదని తెలిపారు. గ్రామ యువకులంతా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ భక్తులకు సహకరించాలని, పోచమ్మ తల్లిని భక్తిశ్రద్ధలతో, సంతోషోత్సాహాల మధ్య గ్రామంలోకి ఆహ్వానించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ సహకరించి జాతరను విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ, వీడీసీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## ఏకపక్ష నిర్ణయాలతో కార్మిక వర్గాన్ని మానసిక శోభకు గురిచేయడం చేయడం శోచనీయం

### ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి.



**బెల్లంపల్లి, అక్టోబర్ 12, (జనంసాక్షి)** కార్మిక చట్టాలను, మానవ హక్కులను, చివరికి ప్రపంచ ఆరోగ్య సూత్రాలను అమలు చేయకుండా ఏకపక్ష నిర్ణయాలతో కార్మిక వర్గాన్ని మానసిక క్షోభకు గురిచేయడం శోచనీయమని ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి అన్నారు. మంగళవారం బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని గనిలో గేట్ మీటింగ్ కి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో దోపిడి వర్గ ప్రభుత్వాలకు, కార్మిక వర్గ దృక్పథం తెలియని సంఘాలకు సంపూర్ణ రాజకీయ చైతన్యంతో ఆర్టీసీ కార్మికులు మద్యానికి, విచ్చలవిడి డబ్బుల పంపిణీ విధానాలను, పాలకుల మోసపూరిత విధానాలను గుర్తించిన కార్మిక వర్గం ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఎర్రజెండాను, ఐక్య కూటమిని ఆదరించి 77 డిపోలలో ఆర్టీసీ కార్మికులు విజయ బావుటా ఎగిరివేయడం శుభపరిణామం అన్నారు. ఆర్టీసీ కార్మిక వర్గానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ విప్లవ ధన్యవాదాలు తెలియజేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కంపెనీలో రాజకీయ జోక్యాన్ని ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. సింగరేణిలో కార్మికులను కట్టు బానిసల కంటే హీనంగా వ్యవహరిస్తున్న సింగరేణి యాజమాన్యం తమ తప్పుడు విధానాలను విరమించుకోవాలన్నారు. సింగరేణి కంపెనీకి రావలసిన బకాయిలు ట్రాన్స్కో, జెన్కో నుండి ఇవ్వవలసిన 59 వేల కోట్లు బకాయిలను కంపెనీకి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హైదరాబాదులో విద్యుత్ సంస్థల ముందు జరుగు మహా ధర్నాను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థలో మెడికల్ బోర్డులో ప్రపంచ ఆరోగ్య సూత్రాలను పాటించకుండా సింగరేణి మెడికల్ గైడ్లైన్స్ ను అమలు చేయకుండా ఏ రకమైన ఉద్యోగానికి అర్హత లేని కార్మికులను కూడా ఫిట్ ఫర్ సేమ్ జాబు అంటూ వైద్య అధికారులు కార్మికులను, కార్మిక కుటుంబాలను మానసిక క్షోభ కు గురిచేయడాన్ని మానవ హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుంది కాబట్టి యజమాన్యం మానవ దృక్పథంతో మెడికల్ అన్ ఫిట్ చేసి కార్మిక కుటుంబాలలో ప్రతి ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దసరాకు ఇవ్వవలసిన లాభాల వాటాను ఇంతవరకు ప్రకటించకుండా, నికర లాభాలను ప్రకటించకుండా కాలయాపన చేస్తూ కార్మికులను మానసిక క్షోభ గురి చేయడం మానవ హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుందన్నారు. ప్రభుత్వం తమ మేకపోతు గాంభీరత్వాన్ని విరమించి కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను వెంటనే 40శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో కార్మిక చట్టాల అమలు, పారిశ్రామిక సంబంధాలు కొనసాగించకపోవడం, కనీసం మెటీరియల్ సప్లై చేయకపోవడం, కార్మికులను మానసిక ప్రశాంతతగా ఉండనీయకపోవడం ఇదంతా కూడా ప్రపంచ ఆరోగ్య సూత్రాలను పాటించకపోవడంమే అన్నారు. ఈ క్లిష్ట పరిస్థితిలో సింగరేణి కోసం కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఎర్రజెండా యూనియన్ నాయకత్వానికి చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రత్నం ప్రవీణ్, మంతెన రమేష్, రత్నం ఐలయ్య, దాడి రమేష్, సహాయ రామకృష్ణ, అంజత్ ఖాన్, రాజేశం, శాంతిఖని మైన్స్ కమిటీ సభ్యులు, సేఫ్టీ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్‌లో ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

### 40 మంది మహిళలకు చీరల పంపిణీ

### ఆల్ ఇండియా సాఫ్ట్ బాల్ క్రీడాకారిణి సన అంజుమ్‌కు సన్మానం



**తాండూర్,అక్టోబర్ 12(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు పులగం తిరుపతి ఆధ్వర్యంలో, ఆయన స్వంత ఖర్చులతో మండలంలోని 40 మంది పేద మహిళలకి చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల ఏమాజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని కొనియాడారు. దేశంలో మహిళల ఆత్మగౌరవం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఏకైక ప్రభుత్వం బిజెపి మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. మహిళలందరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపేందుకు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారని, ఆయన నాయకత్వానికి మహిళా లోకం అండగా నిలవాలని కోరారు.

**జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడాకారిణికి సత్కారం:**

తాండూరు మండలానికి చెందిన ఎండి బాబా - షబానాల కుమార్తె సన అంజుమ్ ప్రస్తుతం బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల ఆమె ఆల్ ఇండియా స్థాయిలో జరిగే సాఫ్ట్ బాల్ పోటీలకి ఎంపికై మండల కీర్తిని చాటింది. ఈ సందర్భంగా క్రీడాకారిణి సన అంజుమ్‌ను నాయకులు శాలువాతో సత్కరించి, ఘనంగా సన్మానించారు. రాబోయే పోటీల్లో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్, యాంగార్ తుకారాం, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల కార్యదర్శి గాదే రాజేశం, ఆవుల చందు, న్యాయవాదులు శ్యామరావు, దుర్గం రమేష్, సతీశ్వర్, సోషల్ మీడియా కన్వీనర్ కామెరా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ కొనుగోలు, విక్రయాలపై ఆసిఫాబాద్ పోలీసుల కఠిన చర్యలు

### నలుగురు నిందితుల అరెస్ట్, 150 గ్రాముల గంజాయి స్వాధీనం



**ఆసిఫాబాద్, అక్టోబర్ 12 (జనంసాక్షి)** జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, 11.10.2026 న ఆసిఫాబాద్ సబ్ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం. బొజ్జి రావుకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, పోలీసు సిబ్బంది ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించగా గాజుల అజయ్, నాగపురి విష్ణు అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 100 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు ఈస్గాం గ్రామానికి చెందిన సుజీత్ మండల్ వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు వెల్లడించినట్లు తెలిపారు. అనంతరం గుండి ఫ్లైఓవర్ వద్ద తనిఖీలు నిర్వహించగా, మాచర్ల అశోక్, బోయిరె వినేష్ అనే మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అశోక్ వద్ద నుంచి సుమారు 50 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు గంజాయిని విక్రయించి డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఉన్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ రెండు ఘటనల్లో మొత్తం 150 గ్రాముల ఎండు గంజాయిని, సుమారు రూ.7,500 విలువైన మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఏ-1 నుంచి ఏ-4 వరకు పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి పైన తెలిపిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి గౌరవ న్యాయ స్థానం ముందు హాజరు పరుచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎన్. రవి గారు తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ కొనుగోలు, విక్రయాలు, రవాణాకు పాల్పడవద్దని, ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆసిఫాబాద్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10,000 వేతనం అమలు చేయాలి

### పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి -- వెలిశాల కృష్ణమాచారి



**ఆసిఫాబాద్, అక్టోబర్ 12(జనం సాక్షి )** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం చారి కి లితెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారిలి ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ, ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ. 10,000 వేతనం వెంటనే అమలు చేయాలని, ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు, విద్యార్థుల మెనూ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, ప్రతి పాఠశాలకు ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు, యూనిఫాంలు అందించి ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదనపు పనికి అదనపు వేతనం చెల్లించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా కార్మికుల ద్వారానే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వెలిశాల కృష్ణమాచారి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సిఐటియు గా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. లిఈ కార్యక్రమంలో పాగిడి మాయ యూనియన్ జిల్లా కార్యదర్శి యూనియన్ జిల్లా నాయకులు శ్యామల పద్మ విజయ సుగుణ సువర్ణ కమల పెంటక్కలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆదివాసి హక్కులను కాపాడుకోవాలి

### తొడసం శంభూ



**సారంగాపూర్, అక్టోబర్ 12 (జనం సాక్షి)** తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (రూా+ూా) సారంగాపూర్ మండల సభ స్వర్ణ గ్రామంలో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా బిూా+ూా నిర్మల్ జిల్లా కార్యదర్శి తోడసం శంభుబి హాజరయ్యారు. తొడసం శంభు మాట్లాడుతూ సోమవారం జరిగిన మండల సభలో ఆదివాసీల సమస్యలపై విస్తృతంగా చర్చించడం జరిగింది. ఆదివాసీలు ఐక్యంగా ఉండాలని, తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కొమరం భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, గ్రామ గ్రామాన రూా+ూా సంఘాన్ని బలోపేతం చేయాలని అన్నారు. ఆదివాసీ యువత చదువుతో పాటు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. అలాగే మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో ఉన్న సమస్యలను నాయకులు ఏకరువు పెట్టారు. వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని హామీ ఇచ్చారు. అనంతరం సారంగాపూర్ మండల నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులు తొడసం గంగారాం, తొడసం కాసినాథ్ అధ్యక్షులు గా పెంద్రం దేవరావు కార్యదర్శి గా, ఉపాధ్యక్షులు మాడవి ఆనందరావు, సహాయ జర్యదర్శి గా మాడవి లేలుసావ్, కోశాధికారి గా సీడం దేవరావు ను ఏక గ్రీవంగా 14 మందితో నూతన కమిటీ ఏనుకోవడం జరిగింది ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

### పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం

# అండగా సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**రామకృష్ణాపూర్, అక్టోబర్12(జనంసాక్షి):** పేద మధ్య తరగతి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఒడ్నాల శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కౌన్సిలర్లతో కలిసి అర్హులైనా వారికి సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతులు, మహిళలు, పేదలు, వృద్ధులు బలహీన వర్గాల ప్రజలకు ప్రాధాన్యతను ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుపరుస్తుందన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ త్వరగతిన పనులను పూర్తి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, కూతురు ప్రభాకర్, భీమా మల్లేష్, మంతెన మల్లమ్మ, దాముఖ శిరీష, మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, నాయకులు గాండ్ల సమ్మయ్య, రాజ్ కుమార్, శ్రీనివాస్, సురేందర్, నక్క శ్రీనివాస్, ప్రేమ్ సాగర్, రమేష్ పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికై నేడు ధర్నా



**రామకృష్ణాపూర్, అక్టోబర్ 12(జనంసాక్షి):** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికై నేడు హైదరాబాద్ లోని విద్యుత్ సౌధ వద్ద నిర్వహించే ధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటియూసీ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సిహెచ్పిలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు సింగరేణిలో ప్రతి హక్కును పోరాటంతోనే సాధించుకున్నామని, ప్రస్తుతం సింగరేణి యాజమాన్యం అవలంబిస్తున్న తీరుకు మరో పోరాటానికి కార్మికుల సిద్ధంగా ఉండాలని తెలిపారు. సింగరేణి కార్మికులకు అవసరమైన పనిముట్లు డ్రిల్ రాడ్స్, డ్రిల్ బిట్స్, కీలలు కొనలేని పరిస్థితుల్లో సింగరేణి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణికి రావాలసిన బకాయిలను రాబట్టి కార్మికులకు లాభాల వాటా, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పక్షాన ఉండి వెంటనే బకాయిలు చెల్లించకపోతే తిరిగి అధికారంలోకి రాదని హితవు పలికారు. ఈ సమావేశంలో ఫిట్ సెక్రటరీ హరి రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఇప్ప కాయల లింగయ్య, ఫిట్ కమిటీ సభ్యులు సీతారామారావు, డొక్కు శ్రీనివాస్, అబ్బాస్, శ్రీను, శ్రీధర్ రావు, శ్రీనివాస్, మల్లమ్మ, రజిత, వైష్ణవి, పద్మ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

గ్రామానికి చెందిన భానోత్ దేశాయ్ తనకు గ్రామంలో గల భూమి నిషేధిత జాబితాలో చూపుతోందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కోటపల్లి మండలం మల్లంపేట గ్రామానికి చెందిన కొండ్ర సుదర్శన్ తమ గ్రామంలో జరిగిన గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వేమనపల్లి మండలం సంపుటం గ్రామానికి చెందిన కుబిడే వెంకటేశం రైతులతో కలిసి నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువలో పూడుకుపోయిన మట్టిని తొలగించి పంట సాగుకు నీటిని అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చెన్నూర్ మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన ఆతుకూరి సుప్రజ చెన్నూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన అబ్దుల్ సత్తార్ ఓవర్ బ్రిడ్జి సమీపంలోని పోచమ్మ చెరువు నుండి వచ్చే వరద కాలువకు సంబంధించి జరిగిన భూ ఆక్రమణలను తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సి.పి.ఎం. జిల్లా ప్రతినిధి బోడెంకి చందు జిల్లాలోని నెన్నెల మండలం కోసంపేట ఆదివాసి సాగు భూములలో జరిగే దౌర్జన్యాలు, దాడులను ఆపి పోడు సాగు చేసుకుంటున్న భూములు వారికి ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. భీమారం మండలం మద్దికల్ గ్రామానికి చెందిన జయ్యారపు దుర్గ ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి జాబితాలో తన పేరు వచ్చిందని, ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీకి చెందిన లిక్కి శంకరయ్య తన కూతురుకు గిఫ్ట్ డీడ్ ద్వారా ఆస్తి ఇచ్చానని, ఇప్పుడు తనకు ఎలాంటి ఆధారం లేకుండా ఉన్నానని, తనకు అట్టి ఆస్తిని తిరిగి ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నస్పూర్ లోని 37వ వార్డుకు చెందిన జె.కృష్ణారావు తమ వార్డు ప్రగతి నగర్ లో సి.సి. రహదారులు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 47 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో వెట్టి చాకిరీ నిర్మూలనపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు రూపొందించిన "స్వేచ్ఛా రథం" వాహనాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి క్రాంతి కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టి చాకిరీ, బలవంతపు శ్రమ వంటి దురాచారాలను నిర్మూలించి కార్మికులకు న్యాయం జరిగేలా స్వేచ్ఛ రథం ద్వారా అవగాహన కల్పించడంతో పాటు బాధితులకు సహాయ సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో బాండెడ్ లేబర్ హెల్ప్ లైన్ నం.080-6943434 పై అందరికీ తెలిసే విధంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, భూగర్భ గనులు, క్వారీయింగ్, వ్యవసాయ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు అవగాహన కల్పించి వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో

# ఆపరేషన్ చెబుత్రా

ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరుగుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న 28 మందిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 10 మోటార్ సైకిళ్లు, 24 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్ చెబుత్ర" ఒక నిరంతర ప్రక్రియ అని, ఇకనుండి ఈ కార్యక్రమం ప్రతిరోజు కొనసాగుతుందని, ప్రజలు రాత్రి వేళలో అవసరమైతే తప్ప బయట తిరుగవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరయినా ప్రవర్తించినా వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ కర్రె స్వామి ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ కర్రె స్వామి తో పాటు ఇతర సర్కిల్ ఇన్స్పెక్టర్ లు మంగిలాల్, ఓ.శ్రీనివాస్, ఐ శ్రీనివాస్, శ్యాంసుందర్, పలువురు ఎస్సై లు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, త్వరిత స్పందన బృందం ఇతర పోలీసు సిబ్బంది మొత్తం 40 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## అందుబాటులో పాలకవర్గం

- సమస్యల పరిష్కార దిశగా ఉప సర్పంచ్ కిరణ్

పాలకుర్తి, అక్టోబర్ 12 (జనంసాక్షి): ప్రజా సమస్యల సాధనకు "ప్రజల వద్దకు పాలకవర్గం" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జనగామ జిల్లా. పాలకుర్తి మండల మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గం. వివరాల్లోకి వెళితే.... పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ (13వ వార్డు సభ్యుడు) గాదెపాక కిరణ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి. గ్రామం తో పాటు తమ వార్డులో ఉన్న ప్రజల సమస్యలను సావదనంగా విని. వినతులను స్వీకరించి.వాటి పరిష్కారం కోసం అడుగులు వేశారు.విస్తృత్త రీతిలో ప్రజా సమస్యల వినతులకై గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో పాలక మండలి సభ్యులు ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న పనితీరును స్వాగతిస్తూ, గ్రామ ప్రజలు పాలకమండలి సభ్యులను అభినందిస్తున్నారు.

## రోడ్లపై పశువులు కనిపిస్తే చర్యలు తప్పవు

- మున్సిపల్ కమిషనర్ భాస్కర్ హెచ్చరిక



నర్సంపేట అక్టోబర్ 12 (జనం సాక్షి) : నర్సంపేట పట్టణంలో పశువులను రోడ్లపై వదిలితే రూ.5 వేల జరిమానా విధించడంతో పాటు గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ భాస్కర్ హెచ్చరించారు. బతుకమ్మ వేడుకలోకి ఎద్దు ప్రవేశించి ఇద్దరు గాయపడిన నేపథ్యంలో పశువుల యజమానులు వాటిని సొంత స్థలాల్లోనే ఉంచుకోవాలని సూచించారు.

# నకిలీ విత్తనాలను అంటగట్టిన మంగళ సీడ్స్

మేడ ఎల్లారెడ్డి, అజ్మీర తులసి రామ్, బద్దం వెంకటరెడ్డి, తండ సమ్మయ్య, పన్నాల అవినాష్, అజ్మీర సమ్మయ్య, పోరిక రమేష్, బొల్లు అనిల్, వాగవత్ శేఖర్, నన్నెబోయిన సాంబయ్య, సూది సాగర్ తదితరులు పోలీస్ స్టేషన్ ముందు మీడియాతో మాట్లాడారు.

**విత్తన కంపెనీ పై కేసు నమోదు చేసి రైతులకు న్యాయం చేయాలి : అజ్మీర చిరంజీవి రాంనగర్ బాధిత రైతు**

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మంగళ సీడ్స్ యజమాని అశోక్ పై కేసు నమోదు చేయడంతో పాటు రైతులకు జరిగిన నష్టానికి పరిహారం సకాలంలో అందించాలని బాధిత రైతు రాంనగర్ గ్రామానికి చెందిన అజ్మీర చిరంజీవి అంటున్నాడు. విత్తనాలు విక్రయించిన వ్యాపారులు మేము తయారు చేయలేదు. మేము ఖరీదు చేసి మీకు తెచ్చి ఇచ్చాము దీనికి పూర్తి బాధ్యత విత్తన ఉత్పత్తిదారుడే వహించాలని అంటున్నారు. మంగళ సీడ్ కంపెనీ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది రైతుల గోస పట్టడం లేదు అంటే పట్టనట్టు వ్యవహరిస్తున్నాడు. దొంగ సిద్ది విత్తనాలను విక్రయించి రైతులను మోసం చేసిన వారికి తగిన శిక్ష విధించాలి భవిష్యత్తులో ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా భయం ఉండాలి. ప్రభుత్వము పోలీసు శాఖ రైతు సంఘాలు ఈ విషయంలో తమకు అండగా ఉంటాయని ఆశిస్తున్నాను.

**విత్తనం తప్పు అయితే పూర్తి బాధ్యత వహిస్తాను : మాడిశెట్టి అశోక్ మంగళ సీడ్స్ యజమాని వరంగల్**

విత్తనంలో ఎలాంటి సమస్య ఉన్న తాను పూర్తి బాధ్యత వహిస్తానని, పంటకాలం 145 రోజుల నుండి 150 రోజులు అక్కడి రైతులు నాటి 120 రోజులు కూడా పూర్తి కాలేదు. మరో వారం పది రోజుల్లో మా విత్తనానికి సంబంధించిన పొలాలు పూర్తిస్థాయిలో పొట్ట దశ నుండి బయటకు వస్తాయి. మా ఫీల్డ్ అసిస్టెంట్లు ఇప్పటికే ఒకసారి అక్కడి పంట పొలాలను పరిశీలించడం జరిగింది. నేను కూడా మరో వారం రోజుల లోపే పరిశీలిస్తాను. ఎన్నో ఏళ్ల తరబడి విత్తన ఉత్పత్తిలో ఒక ప్రముఖ స్థానంలో ఉన్న మేము రైతులను మోసం చేయాలని ఏ కోశానా ఆలోచించము. ప్రతి సంవత్సరము కొన్ని లారీల విత్తన ధాన్యాన్ని గోవిందరావుపేట మండలం నుండి రైతులు చక్కగా తయారుచేసి అందిస్తున్నారు. నీటి సమస్య ఉంటే మాకు సంబంధం లేదు కానీ విత్తనపరంగా ఎలాంటి సమస్య తలెత్తిన పూర్తిస్థాయిలో బాధ్యత వహిస్తాం.

యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు

## పుల్లూరి దిలీప్ మృతి బాధాకరం



పర్వతగిరి అక్టోబర్ 12 (జనం సాక్షి) : వర్ధన్నపేట యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పుల్లూరి దిలీప్ అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్ రావు,కంటెస్టెంట్ జెడ్పీటీసీ జాటోత్ శ్రీనివాస్ నాయక్ ,దిలీప్ భౌతికకాయానికి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా బొంపల్లి దేవేందర్ రావు మాట్లాడుతూ.. పుల్లూరి దిలీప్ ఇక మన మధ్య లేకపోవడం ఎంతో బాధాకరమని అన్నారు. వర్ధన్నపేటలో కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలో పార్టీ బలోపేతం కోసం దిలీప్ అహర్నిశలు కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్ని విధాలా అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. జాటోత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. దిలీప్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలా చేదోడువాదోడుగా నిలిచి, అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏనుగల్ సర్పంచ్ తుర్రె పద్మ, పర్వతగిరి పట్టణ అధ్యక్షుడు సంతోష్, గోరుగుంట సర్పంచ్ బి. లక్ష్మీ భాస్కర్, గద్దం జనార్దన్,బిలునాయక్, బొట్ల వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ కందికట్ల అనిల్, వర్ధన్నపేట నియోజకవర్గ అసెంబ్లీ జనరల్ సెక్రటరి భూక్య విజేందర్ నాయక్, మండల ఉపాధ్యక్షుడు దేవరాజ్, సొసైటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లో పనిచేస్తున్న నాయకులు, సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ఎస్టీ సెల్, ఎస్సీ సెల్ నాయకులు, యూత్ కాంగ్రెస్ మండల, జిల్లా స్థాయి నాయకులు తదితరులు పాల్గొని దిలీప్‌కు నివాళులర్పించారు.

# అన్నపూర్ణాదేవిగా శ్రీ భద్రకాళి అమ్మవారు



వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 12 (జనం సాక్షి) : కాకతీయుల రాజధాని ఏకశిలా నగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవములు రెండవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 04-00 గంటలకు నిత్యాహ్నికం నిర్వర్తించిన తదుపరి అర్చకులు అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి బ్రహ్మచారిణి, సాయంకాలం దేవజా దుర్గా క్రమాలలో పూజారాధనలు జరిపారు. ఉదయం మకర వాహన సేవ సాయంకాలం చంద్రప్రభ వాహన సేవ పై ఊరేగించారు. నవదుర్గా క్రమంలోని బ్రహ్మచారిణి దుర్గా క్రమంలో ఆరాధింపబడిన అమ్మవారు సాధకుల దృష్టిని శరీరంలోని స్వాధిష్ఠాన చక్రంమీద కేంద్రీకరింపజేసి సాధకుడిని విష్ణుమూర్తి యొక్క అనుగ్రహానికి పాత్రులను చేసి అధికారం, జ్ఞానం రెండింటినీ ప్రసాదిస్తుంది. దేవజా దుర్గా ఈమె సమస్త దేవతా కోవనంభూత, సాధకుడిని బాధిస్తున్న అసురీ శక్తులను దునిమి పారేస్తుందని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు.మకర వాహనం మీద అమ్మవారిని గంగాభవానిగాను, చంద్రప్రభ వాహనం మీద అమ్మవారిని రాజరాజేశ్వరిగాను అలంకరించారు. కార్యక్రమాలకు ఉభయదాతలుగా సూర్యకుటీర్ అధినేతలు తంగళ్ళపల్లి తిరుమలాదేవి సంపత్ కుమార్, హర్షవర్ధన్–డా॥ మానస దంపతులు, కుమారి వైష్ణవి, బైరి రవికృష్ణగౌడ్ – సరోజన, హరికృష్ణ–హరిత దంపతులు, ఊడుగుల సాయికిరణ్–డా॥ హర్షిత దంపతులు, గీతాభవన్, రాఘవేంద్ర టిఫిన్స్ హటరీటల్స్ అధినేతలు బాలచంద్రహోళ్ళ– రేణుక దంపతులు, చంద్రశేఖర శెట్టి– జ్యోతి దంపతులు, కొప్ప నాగరాజశెట్టి -ప్రభావతి దంపతులు, అన్నపశెట్టి– హేమ దంపతులు, శ్రీ సందీప్ దీవెశెట్టి–సమత దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

## ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

**ఏవో బన్న రజిత**

నల్లబెల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో యాసంగి 2026--27 సీజన్‌లో రైతులు అప్రమత్తంగా ఉంటూ ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని ఏవో బన్న రజిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యేక ప్రసార కార్యక్రమంలో ఎల్ నినో ప్రభావం కారణంగా యాసంగిలో సాగుచేసే పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ కాలపరిమితిలో పండే పంటలు, తక్కువ నీరు, తక్కువ విద్యుత్తు అవసరమయ్యే పంటలకు ప్రాధాన్య మివ్వాలని తెలిపారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వివిధ రకాల పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, చిరుధా న్యాలను అందుబాటులో ఉన్న నీటి వనరులను బట్టి సాగు చేయాలని సూచించారు. కార్యక్రమం డిఆర్డిఎ డిపి నాగపద్మజ, తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీడీవో రమణారెడ్డి, వెటర్నరీ డాక్టర్ వేణు అంకటి, డిప్యూటీ తహసీల్దార్, ఏపీఎం, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖల అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, నల్లబెల్లి సర్పంచ్ నాగెల్లి జ్యోతి ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- ఓట్ల చోరీని అరికట్టాలి : ఆత్రం సుగుణక్క
- చలో ఢిల్లీ ప్రజాస్వామ్యం కోసం' ర్యాలీలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్న ఆత్రం సుగుణక్క




**ఆసిఫాబాద్, అక్టోబర్ 12(జనం సాక్షి) :** ఢిల్లీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతూ రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కుమురం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క విమర్శించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ ప్రజాస్వామ్యం కోసం నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఢిల్లీలో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులతో కలిసి సుగుణక్క పాల్గొన్నారు. ఈ నిరసన ర్యాలీ తెలంగాణ భవన్ నుంచి బారాఖంబా రోడ్‌లోని మండి హౌస్ మీదుగా సుప్రీంకోర్టు సమీపం వరకు కొనసాగింది. ఓటు చోరీని అరికట్టాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలను పరిరక్షించాలని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా నినదించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆత్రం సుగుణక్క పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీరుపై విమర్శలు చేశారు. ఓటు హక్కు కాపాడాల్సిన ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాలని డిమాండ్ చేశారు.



## గాయత్రీ దేవి అవతారంలో దుర్గామాత అమ్మవారు

**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 12 ( జనం సాక్షి ) :** మండలంలోని తాటికొండ గ్రామంలో ఉన్నటువంటి శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆదివారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు దుర్గామాత అమ్మవారు గాయత్రి దేవి అవ తారంలో దర్శనమిచ్చారు. అర్చకుడు జిడికంటి వరుణాచార్యుల ఆధ్వర్యంలో దుర్గ అమ్మవారికి పంచామృత అభిషేకం, జలాభిషేకం, గణపతి పూజ, నవగ్రహ పూజ,అర్చన, హోమం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్య క్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మ వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదం తీసుకున్నారు. సాయంత్రం కుంకుమపూజ,అర్చన తదితర కార్య క్రమాలునిర్వహించారు.ఈ కార్యక్రమంలో పండగ బుచ్చయ్య, భవాని మాల స్వాములు పండగ రాజేశ్వర్, పర్వ రాజు,పండుగ సత్తయ్య, పండుగ రవి, అక్కెనపల్లి రాములు, మారపాక నాగరాజు, అక్కెనపల్లి రాకేష్,శ్రీపతి రాజు,నారబోయిన కార్తీక్, చిలువేరు వర్షిత, మొగ్గం ప్రవస్తి, భక్తులు, మహిళలు, పాల్గొన్నారు.

## కెరమెరి ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం

**కెరమెరి, అక్టోబర్ 12(జనంసాక్షి) :** కెరమెరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 5 దరఖాస్తులు స్వీకరించినట్లు ఇంచార్జ్ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. ఉపాధి హామీ 1, హౌసింగ్ 2, పంచాయతీ కి సంబంధించిన 2 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మండల అధికారులు హామీ ఇచ్చారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఆడే ప్రకాష్, హౌసింగ్ ఏఈ రత్నం బాబు, ఏపిడిపిఓ పాహిమా మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాల వేళ రోడ్ల మరమ్మతు పనుల పరిశీలన



**ఏటూరునాగారం, అక్టోబర్ 12(జనంసాక్షి) :** పవిత్ర దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో రహదారుల పరిశీలన మరియు రోడ్ల గుంతల పూడ్చివేత పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి కాకులమర్రి శ్రీలత గారిది ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పనులను ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. దసరా ఉత్సవాల కమిటీ అధ్యక్షులు తుమ్మ మల్లారెడ్డి కి ములుగు జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు రూ. 50,000 విరాళంగా ప్రకటించగా, వారి సోదరులు కాకులమర్రి ప్రదీప్ రావు రూ. 30,000 రూపాయలు ఆర్థిక సాయాన్ని ఉత్సవ కమిటీకి అందజేశారు. దసరా వేడుకలు ఘనంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించిన వారిని ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, కూనూరు అశోక్ గౌడ్, తాడూరి రఘు, సప్పిడి రామ్ నర్సయ్య, ఎండి ఖాజా పాషా, కర్ర రవీందర్, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, రామాలయం గుడి చైర్మన్ దన్నపునేని కిరణ్, పులసం పురుషోత్తం, కుమ్మరి చంద్రబాబు, గండేపల్లి నర్సయ్య, వావిలాల ముత్తయ్య,జాడి భోజరావు, అంగాల వీరన్న కాళ్ల రామకృష్ణ, కొండాయి చిన్ని, బట్టు గోపి, ఏం పెళ్లి రాజు, పెద్ద బోయిన బాలకృష్ణ, గండేపల్లి నాగరాజు, మాదరి మధు,మాజీ కోఆప్షన్ సభ్యులు ఖలీల్, దేపాక శ్రీరాములు, తాళ్ల పెళ్లి మోహన్, పాలకుర్తి విజయ్, గ్రామపంచాయతీ ప్రతినిధులు, పార్టీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నైతం రాజు మృతి ఆదివాసీ ఉద్యమానికి తీరని లోటు

**సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్**



ఆసిఫాబాద్ , అక్టోబర్ 12(జనం సాక్షి)తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం కొమురం భీం జిల్లా ఉపాధ్యక్షుడు నైతం రాజు మృతి ఆదివాసీ, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ అన్నారు. చిన్న వయసులోనే అనారోగ్యంతో ఆయన మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. 2017లో రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా తమ్మినేని వీరభద్రం నాయకత్వంలో నిర్వహించిన నాలుగు వేల కిలోమీటర్ల మహాజన పాదయాత్రలో నైతం రాజు సభ్యుడిగా పాల్గొన్నారని గుర్తుచేశారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన ఆయన మరణం ఉద్యమాలకు తీరని లోటని పేర్కొంటూ, రాజుకు నివాళులర్పించారు.

## విద్యార్థులకు దసరా సెలవుల్లో 10 రోజుల ఇంటర్న్‌షిప్ శిక్షణ



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12(జనంసాక్షి ):** వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా విద్యార్థులకు ప్రాయోగిక పరిజ్ఞానాన్ని అందించి, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను మెరుగు పరచాలనే లక్ష్యంతో పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్, ఆసిఫాబాద్ లోని వృత్తి విద్యా విభాగాల విద్యార్థులకు వివిధ సంస్థల్లో 10 రోజుల ఇంటర్న్‌షిప్ శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మన గ్లోబల్ సొల్యూషన్స్ శివ కమ్యూనికేషన్స్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఆసిఫాబాద్ వంటి సంస్థల్లో శిక్షణ అందించనున్నారు. మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఐటీ,ఐటీఈఎస్ విభాగాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఓపీ (ఓపీ ), ఆరోగ్యశ్రీ ఆన్‌లైన్ విభాగాల్లో శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్ట్రేషన్, కంప్యూటర్ ద్వారా డేటా ఎంట్రీ, ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ విధానాల వినియోగం వంటి అంశాలను ప్రత్యక్షంగా నేర్చుకుంటున్నారు.

గిరిజన దర్బార్‌లో ప్రజల సమస్యలు తెలుసుకున్న

## ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



**ఏటూరునాగారం, అక్టోబర్ 12(జనంసాక్షి) :** ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై మొత్తం 7 దరఖాస్తులు అందాయి. ఆర్‌సిఓ మహబూబాబాద్‌కు సంబంధించి 3 దరఖాస్తులు అందాయి. వీటిలో ఉద్యోగానికి సంబంధించి ఒకటి, డిప్యుటేషన్‌కు సంబంధించి ఒకటి, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా భార్య పనిచేస్తున్న పాఠశాలకు బదిలీ చేయాలని కోరుతూ ఒక దరఖాస్తు ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలం అకినేపల్లి మల్లారం ప్రాంతంలో గిరిజన, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, భూముల బదలాయింపులు, మ్యుటేషన్లపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒక దరఖాస్తు అందింది. ఈ కార్యక్రమంలో ఏపీఓ జి ప్రతాప్, డీడీ జనార్ధన్, ఈఈ ప్రవీణ, ఏఓ ఏ అనిల్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కె క్రాంతి కుమార్, ఆర్‌సిఓ పద్మిని తదితర అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం స్వాధీనం

**భీమిని, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** భీమిని మండలంలోని వడాల గ్రామ శివారులో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్ఐ కోటేశ్వర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం వడాల గ్రామ శివారులో వాహనాలు తనికి చేస్తుండగా ఆటోలో శ్రీకాంత్ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న సుమారు 3 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని, అట్టి వ్యక్తిని విచారించగా కేస్లాపూర్, భీమిని గ్రామంలో తిరిగి గ్రామస్థుల వద్ద ఉన్న రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి కాగజ్ నగర్ లోని సామెల్ అనే వ్యక్తికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని తెలిపాడు. రేషన్ బియ్యం మరియు ఆటో ను స్వాధీన పరుచుకొని శ్రీకాంత్ పై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కోటేష్ తెలిపారు.

## గ్రంథాలయంలో అభ్యర్థుల కొరకు సదుపాయాల కల్పన

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 12 (జనంసాక్షి) :** విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థుల కొరకు గ్రంథాలయంలో సదుపాయాలు కల్పించామని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించి, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడి, గ్రంథాలయంలో వారికి కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి, అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను గుర్తించి, మెరుగైన వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రంథాలయంలోని మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించాలని, విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. నూతనంగా కొనుగోలు చేసిన పోటీ పరీక్షల పుస్తకాలను పరిశీలించి, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, అధ్యయన సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలని, నిరంతరం సాధన చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, కష్టపడి చదివి, మంచి ఫలితాలు సాధించి, తమ లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు.